https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక



**దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి**

దివ్యాంగుల శంఖారావం' సభలో హరీశ్‌రావు

2లో..

సంపుటి - 03 | సంచిక -80 | తెలంగాణ | ఆదివారం | తేదీ: 30.08.2026 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3

# సర్ ప్రక్రియ సవరించాలి

**92.86 లక్షల మందికి నోటీసులు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**'సర్' సవరణల సమర్పణకు మరో నాలుగు వారాల గడువు పొడిగించాలని సీఈసీకి లేఖ**

**తాత్కాలికంగా ఇల్లు మారిన వారి ఓటు హక్కు తొలగించవద్దని స్పష్టీకరణ**

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 : తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)–2026 ప్రక్రియ లోపభూయిష్టంగా తయారైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లు తమ ఓటు హక్కును నిలబెట్టుకోవడానికి మళ్లీ ఆధారాలు చూపించుకోవాల్సిన లేదంటే ఓటును కోల్పోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్ది, అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు శనివారం ఆయన ఒక సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్రంలో జూన్ 10 నాటికి 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 73.39 లక్షల (21.7%) మందిని ఏఎస్‌డీడీ (ఆచూకీ లేని/గైర్హాజరు/మరణించిన/డూప్లికేట్) ఓటర్లుగా గుర్తించడంపై సీఎం ప్రశ్నలు గుప్పించారు. వీరిలో 45.19 లక్షల మందిని ఏ ప్రాతిపదికన శాశ్వత వలసదారులుగా వర్గీకరించారని నిలదీశారు. అలాగే 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా, 60.50 లక్షల మంది వివరాల్లో వ్యత్యాసాలు, 32.36 లక్షల మంది అన్‌మ్యాప్డ్ ఓటర్లు ఉన్నట్లు తేలిందని, ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92.86 లక్షల మందికి నోటీసులు ఇస్తున్నారని గణాంకాలతో విమర్శించారు.

2లో..






## పోతారెడ్డిపేట గ్రామ అభివృద్ధికి కృషి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- శ్రీ కేదారేశ్వర ఆశ్రమ ప్రహరి నిర్మాణంకు భూమి పూజ

2లో..

సిద్దిపేట టైమ్స్ అక్బర్ పేట భూంపల్లి ఆగస్టు 29 గ్రామంలోని సమ స్యలు పరిష్కరించి, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందరావు అన్నారు. శనివారం అక్బర్ పేట భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామంలో ఆయన పర్యటించారు. టోల్గేట్ వద్ద శ్రీ కేదారేశ్వర ఆశ్రమం ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకేదారేశ్వర ఆశ్రమ నిర్వాహకులు రాములు మహారాజ్‌తో కలిసి భూమి పూజ చేశారు.

## ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై వేటు!

- ఆరోపణల నేపథ్యంలో పార్టీ నుంచి బహిష్కరిస్తూ, పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఎంఐఎం ఆదేశం
- అవి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ వీడియోలని, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్న రహ్మత్ బేగ్



సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 : తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు లీక్ అయి వైరల్‌గా మారడంతో ఎంఐఎం అధిష్ఠానం ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది. ఆగస్టు 28న రాత్రి ఆయనను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా, ఆయన పదవీ కాలం 2029 వరకు ఉన్నప్పటికీ వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించింది.

2లో..





## వేపచెట్టు వివాదం.. ఇద్దరి దారుణ హత్య!

- చెట్టు కొమ్మల విషయంలో మొదలైన చిన్న తగవు.. ఇరు వర్గాల మధ్య తీవ్ర రక్తపాతానికి దారి తీసిన ఘోరం
- తండ్రితో పాటు పొరుగింటి వ్యక్తిపై గొడ్డలితో తెగబడిన కొడుకులు.. ఇద్దరూ అక్కడికక్కడే మృతి
- ఆగ్రహంతో నిందితుల ఇంటిపై రాళ్లు విసిరిన గ్రామస్తులు.. అడ్డుకోబోయి ఎస్సైకి తీవ్ర గాయాలు

2లో..

## ఖర్గే వేదిక శుద్ధీకరణ నేరం

- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాల్సిందే
- హల్ద్వానీ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ ప్రధాని మోదీని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ
- దళితుల పురోగతిని జీర్ణించుకోలేని బీజేపీ-ఆర్ఎస్ఎస్ మనస్తత్వానికి ఈ ఘటన ఒక నిదర్శనమని ధ్వజం

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు 'శుద్ధీకరణ' చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది తీవ్రమైన నేరమని, బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ పూచీకత్తు చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2లో..



## 680కి పైగా 'నేపాల్' మృతులు సంఖ్య

- 2,400 మందికి పైగా ఆచూకీ లభించక తీవ్ర ఆందోళన
- రెస్క్యూ ఆపరేషన్‌లో భారత్‌కు చెందిన నిపుణుల టన్నెల్ బృందం.. ఇప్పటివరకు 57.6 టన్నుల సహాయక సామాగ్రి సరఫరా.
- సరస్సు కట్టతెగి మళ్లీ ప్రళయం ముంచుకొచ్చే ప్రమాదముందని చైనా హెచ్చరిక..

2లో..



## పంచాయితీ లేని పట్టాలు అందిస్తాం

- అక్రమ పాసుపుస్తకాలు రద్దు చేస్తాం.. ఏడాదిన్నరలో రీసర్వే పూర్త
- 1,632 మంది రైతులకు సీలింగ్ భూముల పాసుపుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి
- భూసమస్యల శాశ్వత పరిష్కారానికే 'భూభారతి' చట్టం తీసుకొచ్చామని వెల్లడి
- మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే ప్రారంభం

2లో..

సిద్దిపేట టైమ్స్, సూర్యాపేట, ఆగస్టు 29 : రాష్ట్రంలో అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ భూములు మినహా వివాదాలు లేని ప్రతి అంగుళం భూమిని రానున్న ఏడాదిన్నర కాలంలో రీసర్వే చేసి, అర్హులైన రైతులందరికీ పంచాయితీలేని పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని, తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 1,632 మంది రైతులకు 2021.20 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించిన పట్టా పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.




## నీట్ పీజీకి సిద్ధమవుతున్న వైద్య విద్యార్థిని ఆత్మహత్య!

- ఆదివారం పరీక్ష రాయాల్సి ఉండగా శనివారం విగతజీవిగా మారిన ఎంబీబీఎస్ పూర్తి చేసిన యువతి
- హాస్టల్ గదిలో విషపదార్థం తీసుకుని బలవన్మరణం.. తల్లిదండ్రులకు మిగిలిన తీవ్ర శోకం
- ఇంటర్ నుంచే డిప్రెషన్తో బాధపడుతున్నట్లు తండ్రి వెల్లడి..
- చిక్కడపల్లి పోలీసుల కేసు నమోదు

2లో..

# వేపచెట్టు వివాదం.. ఇద్దరి దారుణ హత్య!

**-చెట్టు కొమ్మల విషయంలో మొదలైన చిన్న తగవు.. ఇరు వర్గాల మధ్య తీవ్ర రక్తపాతానికి దారి తీసిన ఘోరం**
**-తండ్రితో పాటు పొరుగింటి వ్యక్తిపై గొడ్డలితో తెగబడిన కొడుకులు.. ఇద్దరూ అక్కడికక్కడే మృతి**
**-ఆగ్రహంతో నిందితుల ఇంటిపై రాళ్లు విసిరిన గ్రామస్తులు.. అడ్డుకోబోయి ఎస్సైకి తీవ్ర గాయాలు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 :**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండా (ఎర్రగట్టు తండా)లో ఓ చిన్న వేపచెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. పక్కపక్కనే నివాసముంటున్న అమరబోయిన వెంకటేశ్వర్లు(70), భూక్యా సైదా(68) కుటుంబాల మధ్య ప్రాంగణంలోని వేపచెట్టు తొలగింపు విషయమై కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సైదా పెద్ద కుమారుడు పెదబాబు చెట్టు మొదట్లో నిప్పు పెట్టడంతో, ఆ చెట్టు వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలో పడిపోయింది. శనివారం ఉదయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు తమ రాకపోకలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగిస్తుండగా ఆగ్రహానికి గురైన సైదా కుమారులు పెదబాబు, రాము, వారి తల్లి గొడ్డళ్లతో వెంకటేశ్వర్లు ఇంట్లోకి ప్రవేశించి విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కళ్లముందే జరుగుతున్న ఘోరాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన నిందితుల సొంత తండ్రి సైదాపై కూడా కుమారులు గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి అపస్మారక స్థితిలో ఉన్న సైదాను హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఓ చిన్న చెట్టు కొమ్మల వివాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపి, ఇద్దరి దారుణ హత్యకు దారితీయడంతో తండాలో తీవ్ర కలకలం రేగింది. ఈ దారుణ ఘటనతో ఆగ్రహానికి గురైన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, స్థానిక తండావాసులు నిందితుడైన సైదా ఇంటిపై రాళ్లదాడికి పాల్పడ్డారు. ఉద్రిక్తతను అదుపు చేసేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్సై నవీన్‌కుమార్‌పై రాళ్లు పడటంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమించడంతో సూర్యాపేట, మిర్యాలగూడ ప్రాంతాల నుంచి భారీగా పోలీసు బలగాలు తండాకు చేరుకుని ఉద్రిక్తతను అదుపులోకి తెచ్చాయి. కోదాడ రూరల్ సీఐ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, దారుణానికి ఒడిగట్టిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నీట్ పీజీకి సిద్ధమవుతున్న వైద్య విద్యార్థిని ఆత్మహత్య!

**-ఆదివారం పరీక్ష రాయాల్సి ఉండగా శనివారం విగతజీవిగా మారిన ఎంబీబీఎస్ పూర్తి చేసిన యువతి**
**-హాస్టల్ గదిలో విషపదార్థం తీసుకుని బలవన్మరణం.. తల్లిదండ్రులకు మిగిలిన తీవ్ర శోకం**
**-ఇంటర్ నుంచే కుంగుబాటు (డిప్రెషన్)తో బాధపడుతున్నట్లు తండ్రి వెల్లడి..**
**-హైదరాబాద్ లోని చిక్కడపల్లి పోలీసుల కేసు నమోదు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 :**

హైదరాబాద్‌లో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువ వైద్య విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఏపీలోని కర్నూలు నగరం రెడ్డినగర్‌కు చెందిన వ్యాపారవేత్త బండి రామ్మోహన్‌రెడ్డి ఏకైక కుమార్తె యశ్విత (26) ఎంబీబీఎస్ పూర్తిచేసింది. గత ఆరు నెలలుగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఒక ప్రైవేటు వసతిగృహంలో నివాసముంటూ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ పీజీ) కోసం శిక్షణ పొందుతోంది. ఆదివారం నీట్ పీజీ పరీక్ష రాయాల్సి ఉండగా, శనివారం ఉదయం 8.30 గంటలకు యశ్విత తన తండ్రితో ఫోన్లో మాట్లాడింది. అయితే 9.30 గంటల తర్వాత తండ్రి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన చెందిన రామ్మోహన్‌రెడ్డి హాస్టల్ నిర్వాహకులకు సమాచారమిచ్చారు. వారు వెళ్ళి గదిలో చూడగా యశ్విత అచేతన స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆమె విషపదార్థం తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. తమ కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతున్న సమయం నుంచే తీవ్ర కుంగుబాటు (డిప్రెషన్)కు గురైందని, శుక్రవారం కూడా ఆమె ఆందోళనగా మాట్లాడటంతో తాను కర్నూలు నుంచి బయల్దేరి వస్తుండగానే ఈ ఘోరం జరిగిందని తండ్రి విలపించారు. పరీక్షకు కొద్ది గంటల ముందు ఏకైక కుమార్తె విగతజీవిగా మారడంతో ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌పై వేటు!

**-ఆరోపణల నేపథ్యంలో పార్టీ నుంచి బహిష్కరిస్తూ, పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఎంఐఎం ఆదేశం**
**-అవి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ వీడియోలని, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్న రహ్మత్ బేగ్**
**-రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చగా మారిన చర్య..**
**-సమగ్ర విచారణ జరపాలని ప్రత్యర్థి పార్టీల డిమాండ్**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 :**

తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు లీక్ అయి వైరల్‌గా మారడంతో ఎంఐఎం అధిష్ఠానం ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది. ఆగస్టు 28న రాత్రి ఆయనను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా, ఆయన పదవీ కాలం 2029 వరకు ఉన్నప్పటికీ వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించింది. గతంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ వద్ద డ్రైవర్‌గా పనిచేసి క్రమంగా నాయకుడిగా ఎదిగిన బేగ్‌పై ఎంఐఎం చరిత్రలోనే తొలిసారిగా ఈ స్థాయిలో కఠిన వేటు వేయడం విశేషం. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ తీవ్రంగా ఖండించారు. కుటుంబంతో కలిసి ఉమ్రా నిమిత్తం మక్కాకు వెళ్లిన ఆయన, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనతో పాటు పార్టీ అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల పరువు తీసేందుకే కొందరు ఈ కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇదివరకే గోల్కొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, తాను పార్టీ కార్యకర్తగానే కొనసాగుతూ ఒవైసీ నుంచి న్యాయం ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఎంఐఎం అధిష్ఠానం బహిష్కరణకు గల స్పష్టమైన కారణాలను అధికారికంగా వెల్లడించకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. బేగ్ ఇంకా శాసనమండలి ఛైర్మన్‌కు రాజీనామా లేఖ సమర్పించలేదు. కాగా, గతంలోనూ ఆయనపై అధికారులతో, ఇతర నేతలతో దురుసుగా ప్రవర్తించేవారనే ఆరోపణలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ డీప్‌ఫేక్ వీడియోల లీకేజీ, బహిష్కరణ అంశంపై సమగ్రంగా విచారణ జరిపి నిజా నిజాలను బయట పెట్టాలని బీజేపీ సహా ఇతర రాజకీయ పక్షాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.




# పోతారెడ్డిపేట గ్రామ అభివృద్ధికి కృషి

**- శ్రీ కేదారేశ్వర ఆశ్రమ ప్రహరి నిర్మాణంకు భూమి పూజ**
**- మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**సిద్దిపేట టైమ్స్ అక్బర్ పేట భూంపల్లి ఆగస్టు 29**

గ్రామంలోని సమ స్యలు పరిష్కరించి, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందరావు అన్నారు. శనివారం అక్బర్ పేట భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామంలో ఆయన పర్యటించారు. టోల్గేట్ వద్ద శ్రీ కేదారేశ్వర ఆశ్రమం ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకేదారేశ్వర ఆశ్రమ నిర్వాహకులు రాములు మహారాజ్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ,ఇరువైపులా త్వరలోనే నూతన బస్టాండ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మన ఊరుమన బడిలో భాగంగా అసంపూర్తిగా ఆగిన పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి పంచాయతీరాజ్ అధికారులతో చరవాణిలో మాట్లాడి, నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల గ్రామంలో మృతి చెందిన భాజపా కార్యకర్త నరేశ్ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.గ్రామ సర్పంచ్ లు మౌనిక, వివిధ గ్రామాలకు సర్పంచులు భాను ప్రసాద్,నాగరాజు,మహేష్,శ్రీనివాస్, భాజపా నాయకులు అంబటి బాలేశ్ గౌడ్, సుభాష్ రెడ్డి, మల్లన్న గారి బిక్షపతి,స్వామి రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియ సవరించాలి

**- ఓటర్ల జాబితా గడువు పెంచాలి**
**-92.86 లక్షల మందికి నోటీసులు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి.**
**-'సర్' సవరణల సమర్పణకు మరో నాలుగు వారాల గడువు పొడిగించాలని సీఈసీకి లేఖ.**
**-తాత్కాలికంగా ఇల్లు మారిన వారి ఓటు హక్కు తొలగించవద్దని స్పష్టీకరణ.**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 :**



తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)-2026 ప్రక్రియ లోపభూయిష్టంగా తయారైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లు తమ ఓటు హక్కును నిలబెట్టుకోవడానికి మళ్లీ ఆధారాలు చూపించుకోవాల్సిన లేదంటే ఓటును కోల్పోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్ది, అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు శనివారం ఆయన ఒక సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్రంలో జూన్ 10 నాటికి 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 73.39 లక్షల (21.7%) మందిని ఏఎస్‌డీడీ (ఆచూకీ లేని/గైర్హాజరు/మరణించిన/డూప్లికేట్) ఓటర్లుగా గుర్తించడంపై సీఎం ప్రశ్నలు గుప్పించారు. వీరిలో 45.19 లక్షల మందిని ఏ ప్రాతిపదికన శాశ్వత వలసదారులుగా వర్గీకరించారని నిలదీశారు. అలాగే 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా, 60.50 లక్షల మంది వివరాల్లో వ్యత్యాసాలు, 32.36 లక్షల మంది అన్‌మ్యాప్డ్ ఓటర్లు ఉన్నట్లు తేలిందని, ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92.86 లక్షల మందికి నోటీసులు ఇస్తున్నారని గణాంకాలతో విమర్శించారు. సర్‌లో సర్వే సిబ్బంది తాత్కాలికంగా ఇంట్లో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే గాటన కట్టారని సీఎం ఎత్తిచూపారు. ఇల్లు మారిన వారికి కొత్త ప్రాంతంలో ఫారం6 ద్వారా ఓటు నమోదుకు సహకరించకుండా, పాత ప్రదేశంలో ఉన్న ఓటును ముందస్తు సమాచారం లేకుండా రద్దు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే 58.6% ఏఎస్‌డీడీ ఓటర్లు, 41.9% నోటీసులు అందుకునే ఓటర్లు ఉన్నారని, కొద్ది వందల మీటర్ల దూరంలో ఇల్లు మారినా లేదా వివాహం, ఉద్యోగం వల్ల నివాసం మారినా ఓటు పోయేలా చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఆధారాలు, అభ్యంతరాలు సమర్పించడానికి ప్రస్తుతం సెప్టెంబరు 16 వరకు ఉన్న గడువును మరో 4 వారాల పాటు పొడిగించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేనందున, అక్టోబరు 19న విడుదల కావాల్సిన తుది జాబితా ప్రచురణ తేదీని కూడా పొడిగించాలని సూచించారు. గ్రామాలు, నగరాల్లో ముసాయిదా జాబితాలను కనీసం రెండుసార్లు బిగ్గరగా చదివి వినిపించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈసీఐని కోరారు. నోటీసులకు స్పందించేందుకు ప్రస్తుతం ఇస్తున్న వారం రోజుల వ్యవధి ఎంతమాత్రం సరిపోదని సీఎం అభిప్రాయపడ్డారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులు వివిధ ధ్రువపత్రాలు తెచ్చుకోవడానికి కనీసం 3 నుంచి 4 వారాల సమయం కేటాయించాలని కోరారు. అలాగే, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకు పైగా నోటీసులు ఇస్తున్నందున, అధికారులు వ్యక్తిగత విచారణ జరపడం సాధ్యం కాదని, అదనపు ఏఈఆర్‌ఓలను నియమించి ప్రక్రియను వికేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ (జీవో 172)ను ఎన్నికల సంఘం తిరస్కరించడం వల్ల పట్టణ ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని సీఎం తెలిపారు. మండల స్థాయిలో లభించే ఏ గుర్తింపు పత్రాన్నైనా అనుమతిస్తూ స్పష్టమైన జాబితాను ప్రకటించాలని కోరారు. బూత్ స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి బాధితులకు నేరుగా సహాయం అందించాలన్నారు. ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సభలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరూ హక్కును కోల్పోకూడదని, అనర్హులు జాబితాలో ఉండకూడదనేదే తమ తాపత్రయమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హెల్ప్‌డెస్క్‌లు, గ్రామసభలు, ప్రచారం మరియు లాజిస్టికల్ మద్దతుతో సహా ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, సీఈసీకి సీఎం రాసిన లేఖపై ఏఐసీసీ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ.. తెలంగాణలో భారీగా ఓట్ల తొలగింపు ఆందోళనకరమని, సీఎం లేవనెత్తిన వాస్తవ అంశాలపై సీఈసీ తక్షణమే స్పందించాలని 'ఎక్స్' వేదికగా కోరారు.

# ఖర్గే వేదిక శుద్ధీకరణ నేరం..



**-బాధ్యులపై ఎస్సీ,ఎస్టీ కేసు పెట్టాల్సిందే**
**-హల్ద్వానీ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ ప్రధాని మోదీని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ**
**-దళితుల పురోగతిని జీర్ణించుకోలేని బీజేపీ-ఆర్ఎస్ఎస్ మనస్తత్వానికి ఈ ఘటన ఒక నిదర్శనమని ధ్వజం**
**-దేశంలో అంటరానితనం ఇంకా కొనసాగుతోందనడానికి ఇది ప్రత్యక్ష సాక్ష్యమని ఆవేదన**

**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు 'శుద్ధీకరణ' చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది తీవ్రమైన నేరమని, బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ పూచీకత్తు చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 20 రోజులు గడుస్తున్నా, పైగా ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు ఈ చర్యను బహిరంగంగా సమర్థించుకుంటున్నా ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. దేశంలో దళితులు ఉన్నత స్థానాలకు ఎదగడాన్ని, విజయాలు సాధించడాన్ని బీజేపీఆర్ఎస్ఎస్ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఖర్గేతో పాటు గతంలో తికారామ్ జుల్లి, కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ వంటి నాయకులు కూడా వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి శుద్ధీకరణ అవమానాలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఈ ప్రవర్తన అంటరానితనానికి మరో రూపమని, ఆగస్టు 10న జరిగిన ఈ దారుణాన్ని ఖర్గే పార్లమెంటులోనే లేవనెత్తినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన స్పందన లభించలేదని విమర్శించారు. సామాజిక సమానత్వం కోసం రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల సిద్ధాంతాలకు.. కులవివక్షను ప్రోత్సహించే బీజేపీఆర్ఎస్ఎస్ ధోరణులకు మధ్య జరుగుతున్న యుద్ధంగా దీనిని అభివర్ణించారు. వేల ఏళ్లుగా దళితులపై హింస కొనసాగుతూనే ఉందన్న ఆయన, నేటికీ పాఠశాలల్లో దళిత పిల్లలతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, టీకొట్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించడం, పెళ్లిళ్లలో వరుడు గుర్రంపై ఊరేగేందుకు భయపడే పరిస్థితులు ఉండటం ఈ దేశపు చేదు నిజాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

**- దివ్యాంగుల శంఖారావం' సభలో హరీశ్‌రావు**
**-ప్రతి ఒక్కరికీ రూ.66 వేల పింఛను బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్**
**-వచ్చే నెల 4న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తలసాని వెల్లడి**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఆగస్టు 29 :**

దివ్యాంగులపై దయచూపని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'దివ్యాంగుల శంఖారావం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగులైన ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను కనీసం వెయ్యి మందికి చేరవేసి నిలదీయాలని కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని, ఇప్పటి వరకు 33 నెలలకు సంబంధించి ఒక్కొక్కరికీ రావాల్సిన రూ.66 వేల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం2016ను పకడ్బందీగా అమలు చేసి, ఉద్యోగాల్లో 4 శాతం, పదోన్నతుల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రత్యేక నియామకాల ద్వారా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నీరుగార్చి, తులం బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారని విమర్శించారు. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు దివ్యాంగుల కష్టాలు తెలుసు కాబట్టే అడగకుండానే రూ.4,116 పింఛను ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చే నెల 4న దివ్యాంగులతో కలిసి ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ లేని పట్టాలు అందిస్తాం

**-"అక్రమ పాసుపుస్తకాలు రద్దు చేస్తాం.. ఏడాదిన్నరలో రీసర్వే పూర్తి"**
**-1,632 మంది రైతులకు సీలింగ్ భూముల పాసుపుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి.**
**- భూసమస్యల శాశ్వత పరిష్కారానికే 'భూభారతి' చట్టం తీసుకొచ్చామని వెల్లడి.**
**-మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే ప్రారంభం.**

**సిద్దిపేట టైమ్స్, సూర్యాపేట, ఆగస్టు 29 :**

రాష్ట్రంలో అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ భూములు మినహా వివాదాలు లేని ప్రతి అంగుళం భూమిని రానున్న ఏడాదిన్నర కాలంలో రీసర్వే చేసి, అర్హులైన రైతులందరికీ పంచాయితీలేని పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని, తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 1,632 మంది రైతులకు 2021.20 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించిన పట్టా పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. తరతరాలుగా భూములకు హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయడానికే 'భూభారతి' చట్టం తీసుకొచ్చామని ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పేర్కొన్నారు. తేడాది తాను నూతనకల్‌కు వచ్చినప్పుడు రైతులు తమ భూసమస్యలను వివరించారని, ఏడాది వ్యవధిలోనే అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరించి నేడు పట్టాలు అందించడం మంత్రిగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పొంగులేటి ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతన్నలకు సంకెళ్లు వేసి జైలుకు పంపించిన వారే ఇప్పుడు వారిపై మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. భారాస నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో మళ్లీ వచ్చేది ఇందిరమ్మ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. భూములకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత కింద ప్రతి జిల్లాలోని 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే ప్రక్రియను ప్రారంభించినట్లు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో కొందరు భారాస నేతలు రైతుబంధు పథకం ప్రయోజనాలను పొందేందుకు నకిలీ పాసుపుస్తకాలను సృష్టించి రూ.వేల కోట్ల ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారని ఆరోపించారు. రీసర్వే ద్వారా అలాంటి అక్రమ పాసుపుస్తకాలను గుర్తించి తక్షణమే రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీసీఎల్ఏ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు పాల్గొన్నారు.




# 680కి పైగా 'నేపాల్' మృతులు సంఖ్య

**-నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో ఉగ్రరూపం దాల్చిన వరదల్లో 2,400 మందికి పైగా ఆచూకీ లభించక తీవ్ర ఆందోళన**

**కాఠ్మాండూ:** నేపాల్-టిబెట్ సరిహద్దు మంచు కొండల నుంచి ముంచుకొచ్చిన జల ప్రళయం తీవ్ర వినాశనాన్ని సృష్టించింది. మెరుపులా వచ్చి పడిన వరద బురద విలయంలో పారిపోయేందుకు కూడా సమయం లేక వందలాది మంది అభాగ్యులు జలసమాధి అయ్యారు. ఈ ఘోర విపత్తులో మరణించిన వారి సంఖ్య శనివారానికి ఏకంగా 682 దాటింది (నేపాల్‌లో 675, టిబెట్‌లో 7). 320 మంది విదేశీయులతో సహా 2,400 మందికి పైగా జనం ఆచూకీ తెలియడం లేదు. వీరిలో 183 నుంచి 287 మంది వరకు భారతీయులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. విపత్తు సంభవించి రోజులు గడుస్తుండటంతో గల్లంతైన వారి ప్రాణాలపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. వర్షం, బురద, చీకటిని సైతం లెక్కచేయకుండా 16 వేల మందికి పైగా నేపాల్ సైనిక, భద్రతా బలగాలు సహాయక చర్యల్లో అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటివరకు 4,400 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్ సిల్క్యారా టన్నెల్ ఘటనలో ప్రతిభ చూపిన 14 మంది సభ్యుల భారతీయ నిపుణుల బృందం, వైద్య బృందాలు రసువాలోని త్రిశూలి జలవిద్యుత్ కేంద్రం వద్ద బురదలో చిక్కుకున్న సిబ్బందిని కాపాడేందుకు డ్రిల్లింగ్ చర్యలు చేపట్టాయి. భారత్ నుంచి ఇప్పటివరకు 57.6 టన్నుల అత్యవసర వైద్య, ఆహార సామాగ్రి నేపాల్‌కు చేరగా, ప్రధాని మోదీ అందిస్తున్న ఉదార సాయానికి నేపాల్ అధ్యక్షులు, మంత్రులు తీవ్ర కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు టిబెట్‌లోని ఛోచెన్, పురెపు నదుల సంగమం వద్ద ఏర్పడిన వరద సరస్సు నీటిమట్టం ప్రమాదకరంగా మారి నీటి రంగు మారుతోందని చైనా హెచ్చరించింది. ఈ సరస్సు ఏ క్షణంలోనైనా కట్టతెంచుకుంటే సెకనుకు 500 ఘనపు మీటర్ల వేగంతో నీరు కిందకు దూసుకొచ్చి దిగువ నేపాల్‌లో మరోసారి తీవ్ర ప్రళయం సృష్టించే ప్రమాదం ఉందని అధికారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలను అడవుల్లోకి, ఎగువ ప్రాంతాలకు వెళ్లి తలదాచుకోవాలని సూచించారు. ఇక టిబెట్‌లో చిక్కుకున్న 120 మంది భారత యాత్రికులను ప్రత్యామ్నాయ జాంగ్ము మార్గం ద్వారా నేపాల్‌కు సురక్షితంగా తరలించారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు, ఉరుములు, మెరుపులు సహాయక చర్యలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ శాఖ హెచ్చరించడంతో రెస్క్యూ బృందాల్లో ఆందోళన నెలకొంది. రోడ్లు, వంతెనలు, విద్యుత్ కేంద్రాలు ధ్వంసం కావడంతో పునరుద్ధరణ చర్యల కోసం ఏకంగా రూ.48,000 కోట్లు అవసరమవుతాయని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్లిష్ట సమయంలో బాధితులను ఆదుకునేందుకు భారత్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, చైనా, ప్రపంచబ్యాంక్‌తో పాటు అనేక అంతర్జాతీయ సంస్థలు, వ్యక్తిగత దాతలు భారీగా విరాళాలు ప్రకటిస్తున్నారు. శిథిలాల మధ్య బంధువుల అన్వేషణలు, ఆసుపత్రుల వద్ద దీన రోదనలతో నేపాల్‌లోని పరిస్థితి హృదయవిదారకంగా మారింది. ఈ విలయం మధ్య కొన్ని అద్భుత ఘట్టాలు వెలుగుచూశాయి; కేర్ సెంటర్‌లో బురదలో కూరుకుపోయిన 97 ఏళ్ల గుణ మాయ బొహరా అనే బామ్మను రెస్క్యూ సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి ఎక్స్‌కావేటర్ టబ్ సహాయంతో ప్రాణాలతో బయటకు తీశారు.







# ఒకే బేసిన్.. రెండు పద్ధతులు!

**- కొత్తపల్లి విద్యార్థుల సరికొత్త ప్రయోగం**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

ఒకే మరుగుదొడ్డి బేసిన్‌ను భారతీయ, పాశ్చాత్య పద్ధతుల్లో వినియోగించుకునేలా కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు రూపొందించిన వినూత్న నమూనా అందరినీ ఆకట్టుకుంటోంది. రాయపోల్ మండలం కొత్తపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 'ఇండియన్-వెస్ట్రన్ టాయిలెట్ బేసిన్' నమూనాను రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ




భారతీయ పద్ధతిలో కూర్చునే మరుగుదొడ్ల వినియోగం అధికంగా ఉండగా.. ఇటీవలి కాలంలో పాశ్చాత్య పద్ధతి మరుగుదొడ్ల వినియోగం కూడా పెరిగిందని విద్యార్థులు గుర్తించారు. దీంతో రెండు రకాల మరుగుదొడ్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సి రావడం వల్ల స్థలం, డబ్బు వృథా అవుతున్నాయని భావించారు. రైళ్లు, విమానాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కార్యాలయాలు, ప్రజా వినియోగ ప్రదేశాల్లోనూ రెండు రకాల మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనించి.. దీనికి పరిష్కారంగా ఒకే బేసిన్‌ను రెండు పద్ధతుల్లో ఉపయోగించుకునేలా నమూనాను రూపొందించారు.ఈ ప్రాజెక్టును నాలుగో తరగతికి చెందిన మన్నే లతకిప్రియ, ఐదో తరగతికి చెందిన శ్రావణి రూపొందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నాగరాజు మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ నమూనాను తయారు చేశారు. చిన్న వయసులోనే ప్రజలకు ఉపయోగపడే సమస్యను గుర్తించి, దానికి పరిష్కారం చూపేలా ప్రయోగం చేయడంపై ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

**అన్ని చోట్లా అమలు చేయాలి**

తాము రూపొందించిన నమూనాను భారతీయ రైల్వేలు, విమానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ప్రజా వినియోగ ప్రదేశాల్లో అమలు



చేయాలని విద్యార్థులు ఆకాంక్షించారు. ఒకే బేసిన్‌లో రెండు పద్ధతులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థలంతో పాటు నిర్మాణ ఖర్చును కూడా ఆదా చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**-వంశపారంపర్య ధర్మకర్త మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో కళ్యాణం**



**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన పుణ్యక్షేత్రమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర పుణ్య కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దంపతులను గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన పల్లకిలో దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల హరినామశ్చరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం రథ మండపంలో స్వామి కళ్యాణ మహోత్సవాన్ని దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అశేష భక్త జనావళి తిలకిస్తుండగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాంప్రదాయ రీతిలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా దేవస్థానం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవం అనంతరం తిరిగి స్వామి దంపతులను పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపార పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్,



నరసింహయ్య, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా రహెమాన్ దూలే ఉర్సు వేడుకలు



**-భక్తిశ్రద్ధలతో ఫాతెహా కార్యక్రమం**

**-భక్తులకు అన్నప్రసాద వితరణ**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని మైనార్టీ వాడలో కొలువుదీరిన రహెమాన్ దులే దర్గా ఉరుసు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సాహెబ్ ఉరుసు వేడుకలను అత్యంత ఘనంగా సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఈ ఉరుసు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఫాతెహా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహెబ్ దర్గా పై భక్తులు పూల చాదర్లు కప్పి తమ మొక్కులు చెల్లించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. సాహెబ్ దర్గాను సర్వాంగ సుందరంగా అలంకరించారు. రంగు రంగు విద్యుత్ బల్బులతో శోభాయమనగా ముస్తాబు చేశారు. అలాగే సాహెబ్ బందు గద్దోత్సవాన్ని కూడా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మైనార్టీలు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మత పెద్దలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభల వాల్పోస్టర్ ఆవిష్కరణ




**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 8, 9,10వ తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న క్రమంలో శనివారం రాష్ట్ర మహాసభల వాల్పోస్టర్ను పట్టణములోని సంఘ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వైద్య ఉపాధి కల్పనకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ విషయంలో స్పష్టమైన హామీలు అమలు కావడం లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు జాతీయ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గూడెపు సుదర్శన్, కాశబోయిన చరణ్, బోడపట్ల రాజు, బాపు అక్షయ్, గిద్దెల రాజు, తుడుం నర్సింగరావు, బాలకృష్ణ, లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండలో వైభవంగా శేష వాహన సేవ



**-సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు**

**-అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి స్వామి వారి శేష వాహన సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుచ్చి సేవకు బదులు స్వామివారి శేష వాహన సేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ ఆధ్వర్యంలో అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ శేష వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు శేష వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ



ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు న్యాయం

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుంది అని తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ యంజాల కీర్తన విఠల్ రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని రంగాయిపల్లి గ్రామ పంచాయతి లో సర్పంచ్ గడపనబోయిన భాగ్య లక్ష్మి యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం లో పాల్గొని ప్రజలకు రేషన్ కార్డులను పంపిణి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ లక్ష్యం అని అన్నారు.కాంగ్రెస్ అంటేనే ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని ఆమె అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం కు ప్రజలు తోడుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం ఉప సర్పంచ్ బాను పాలకవర్గం సభ్యులు, నాయకులు చందు గౌడ్, శ్రీనివాస్ మరియు ప్రజలు పాల్గొన్నారు.



## అర్జున్ పట్ల పాఠశాలలో ఘనంగా మాతృభాషా దినోత్సవం

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

మండలంలోని అర్జునుపట్ల ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు భాషకు పట్టాభిషేకం చేస్తూ 15 భాషా ప్రక్రియలతో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ గిడుగు రామ్మూర్తి, శ్రీకృష్ణదేవరాయల వేషధారణతో పదవ తరగతి విద్యార్థిని భవిష్య అద్భుత నటనతో అందరినీ ఆకర్షించింది. గొల్లపల్లి అక్షిత వేషధారణతో బుర్రకథ బ్రిల్లెస్ ఏకపాత్రాభినయంతో ఆకట్టుకోవడమే కాకుండా ప్రైజ్ మనీ పొందారు. అష్టదిగ్గజాలుగా రసజ్ఞ, రక్షిత, అయేషా, శరణ్య, అశ్విని, హర్షిని ప్రతిభను ప్రదర్శించగా భానుప్రియ భాష గానం అలరించింది. ఉపాధ్యాయుడు రామచంద్ర మూర్తి స్వీయ రచన దర్శకత్వం నిర్వహణలో ఈ కార్యక్రమాలు జరగగా ప్రతిభ చాటిన వారికి నగదు బహుమతులను ప్రధానోపాధ్యాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరీం చంద్ర కులకర్ణి, సరిత, నరసింహులు, రజిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## హలో మాల.. ఛలో సెక్రటేరియట్

**- రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్.**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ 'హలో మాల ఛలో సెక్రటేరియట్' ముట్టడి విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు పొలిట్ బ్యూరో ఛైర్మెన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో హలో మాల ఛలో సెక్రటేరియట్ ముట్టడి కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం మాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించకుండా ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం వల్ల మాలలకు అన్యాయం జరుగుతోందని, దీనిని వెంటనే సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు."హలో మాల.. ఛలో సెక్రటేరియట్" నినాదంతో ఈ నెల 31 సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు నాయకులు మండల యాదగిరి, మద్దెల చంద్రం, కరికే పర్షరములు, రాంపల్లి సతీష్, నవీన్, అజయ్, భానుప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ క్రీడల దినోత్సవం

**-విజేతలకు బహుమతులు అందజేసిన మున్సిపాలిటీ చైర్మన్**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో శనివారం జాతీయ క్రీడల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ చివరి రోజు కాకతీయ మోడల్ మరియు వెంకటసాయి పాఠశాలల జరిగిన పోటీలలో ఫైనల్ విజేతగా నిలిచిన కాకతీయ పాఠశాల క్రీడాకారులకు స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగం తో పాటు పిఈటిలు కలకప్ప, అన్వర్ పాషా, ఉదయ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

*** రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**



ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయపోల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డా. సిహెచ్. శ్రీనివాస్ కోరారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికపై సంబంధిత అధికారులను కలిసి సమస్యలను తెలియజేసే అవకాశం ప్రజావాణి ద్వారా కలుగుతుందని ఎంపీడీవో తెలిపారు. మండల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## డాక్టర్ సుల్తాన ఉమర్ కు ఘన సన్మానం

**- సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్, సేవారత్న అవార్డు, బంగారు పతకం.**

**- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్.**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిసా సేవారత్న అవార్డు, బంగారు పతకం అందజేయడం అభినందనీయమని డి.బి.ఎఫ్. జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. శనివారం డా. సుల్తాన ఉమర్ నివాసంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సామాజిక సేవను బాధ్యతగా భావించి ఎన్నో ఏళ్లుగా పేదలు, అనాథలు, నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయాన్ని అందిస్తున్న సోషల్ రిఫార్మేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు డా.సుల్తాన ఉమర్ సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి చేయూతనందిస్తూ, సేవాభావంతో ముందుకు సాగుతున్న ఆమెకు లభించిన ఈ గౌరవాలు సామాజిక సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు.పేదలు, అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో ఆమె కొనసాగిస్తున్న సేవలు నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు.సమాజంలో మానవతా విలువలు పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. డా.సుల్తాన ఉమర్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు.డాక్టరేట్, మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు, బంగారు పతకంతో సుల్తాన ఉమర్‌ను సత్కరించడం పట్ల డి.బి.ఎఫ్. నాయకులు, హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలవాలని పి. శంకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతరావుపల్లి ఉప సర్పంచ్ బైరం రమేష్, నాయకులు సతీష్, గణేష్, దాసరి హరిబాబు, ధార మల్లేష్, పుట్ట రాజు,గద్ద నరేష్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల జీవితాల్లో వెలుగుల విప్లవం "గృహజ్యోతి"

**-దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

పేదల జీవితాల్లో వెలుగుల విప్లవంగా కాంగ్రెస్ ప్రభుత్వం "గృహజ్యోతి" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దీంతో 54.37 లక్షల కుటుంబాలకు లబ్ధిదారులుగా చేరడం జరిగిందన్నారు. అలాగే 13.915 కోట్ల జీరో బిల్లులను ఇదివరకే జారీ చేయడం జరిగిందన్నారు. ఆగస్టు వరకు 5,066 కోట్ల ఖర్చు అయిందని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. నిరుపేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఉద్దేశంతోనే ఈ పథకానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునే లబ్ధి పొందాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.




## స్మార్ట్ కార్డులతో రేషన్ సేవలు వేగవంతం

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

ప్రజలకు రేషన్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చిందని కొండాపూర్ సర్పంచ్ నూకల రాము యాదవ్ అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం లో ఉపసర్పంచ్ మాధవి వెంకటేష్ యాదవ్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.





## జనసంద్రమైన నందగోకుల్.. రోడ్డు కోసం కదం తొక్కిన ప్రజలు

**- హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు.. పాదయాత్రకు శ్రీకారం**

**- నందగోకుల్–నస్కల్–చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్**

**- వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి.. లేకుంటే ఉద్యమం ఉద్ధృతం**

**- ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే: బీఆర్ఎస్ నేతలు**

**- రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం : పద్మా దేవేందర్‌రెడ్డి**

**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట ఆగస్టు 29**





నందగోకుల్-నస్కల్-చెల్మెడ కమాన్ మధ్య రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పాదయాత్రకు భారీ స్పందన లభించింది. నందగోకుల్ జనసంద్రమైంది. మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజాంపేట మండలం నందగోకుల్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వరకు పాదయాత్ర



సాగింది. రహదారి నిర్మాణం చేపట్టాలని, ప్రజల కష్టాలు తీర్చాలని నినాదాలు చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పాదయాత్రతో నందగోకుల్ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

**అధ్వానంగా రహదారి.. అవస్థల్లో ప్రజలు**

ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నందగోకుల్-నస్కల్-చెల్మెడ కమాన్ రహదారి పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. గుంతలు, కంకర, బురదతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు, ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు.

**ఆర్టీసీ బస్సు రాకపోకలకు బ్రేక్**

రహదారి దుస్థితి కారణంగా విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన ఆర్టీసీ బస్సు రాకపోకలు కూడా ప్రభావితమయ్యాయని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**బిల్లులు రాక.. నిలిచిన పనులు**

రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సుమారు రూ.3 లక్షల మేర నిధులు మంజూరు చేసిన తర్వాత కొంత మేర పనులు జరిగాయని, అనంతరం కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, మిగిలిన రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**వారం రోజులు గడువు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రులు, సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారం రోజుల్లో రహదారి పనులు తిరిగి ప్రారంభించాలి.. లేకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలు, నిరసనలు, ప్రజా ఆందోళనల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు.

**ప్రజా పాలన అంటే ఇదేనా?**

ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ప్రజల సమస్యలను పరిష్కరించడమే కానీ, సమస్యలను పట్టించుకోకుండా వదిలేయడం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు.

**ప్రజా కష్టాలు పట్టని ప్రభుత్వం**

**మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

ప్రజల కష్టాలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. నందగోకుల్-చెల్మెడ కమాన్ రహదారి పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పాదయాత్రకు తరలివచ్చిన ప్రజల సంఖ్యను చూసైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని వ్యాఖ్యానించారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

**మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి**

ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. రహదారి సమస్యతో నందగోకుల్, నస్కల్, చెల్మెడ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించి ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

***ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే**

పాదయాత్రకు స్థానిక ప్రజలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడం ప్రభుత్వానికి ఒక స్పష్టమైన సందేశమని నాయకులు పేర్కొన్నారు. "ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే. వారం రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం. ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు చేపడతాం. రోడ్డు పూర్తయ్యే వరకు మా పోరాటం ఆగదు" అని తేల్చిచెప్పారు.

**రోడ్డు పూర్తయ్యే వరకు పోరాటం**

రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించి, అవసరమైన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని దశలవారీగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో లావణ్య రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, జీవన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు బాజా చంద్రం, బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు బాలెడ్డి, వెంకటస్వామి, కిష్టాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్వీ నాయకుడు బజార్ రంజిత్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, గౌస్, సుప్రభాతరావు, భాస్కరరావు, మున్సిపల్ కౌన్సిలర్ సుచరిత, సర్పంచ్ లు,మాజీ సర్పంచ్లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పద్మాదేవేందర్‌రెడ్డి హయాం లోనే ఉమ్మడి రామాయంపేట మండలం సర్వనాశనం

**- ఇప్పుడు పాదయాత్రల పేరుతో ప్రజలను మోసం చేయడం ఆపాలి**

**- ప్రజలకు క్షమాపణ చెప్పి పాదయాత్రలు చేయాలి: ***

**- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు**

**- ప్రజలకు కావాల్సింది పాదయాత్రలు కాదు.. శాశ్వత పరిష్కారాలు**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఆగస్టు 29**

పద్మాదేవేందర్‌రెడ్డి జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా కీలక పదవుల్లో కొనసాగిన సమయంలోనే రామాయంపేట ఉమ్మడి మండలం అభివృద్ధికి దూరమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం ప్రజా సమస్యల పేరుతో పాదయాత్రలు నిర్వహించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు.

**అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి ఏది?**

పద్మాదేవేందర్‌రెడ్డి సుమారు ఐదేళ్లు జెడ్పీటీసీగా, దాదాపు ఐదేళ్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా కీలక పదవుల్లో కొనసాగారని రాగి రాములు పేర్కొన్నారు. ఇంతకాలం అధికారంలో ఉన్నప్పటికీ రామాయంపేట ప్రాంతానికి జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. "ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్నా ఒక్క మంచి రోడ్డు వేయలేకపోయారు. కనీసం మురుగు కాలువల సమస్యను కూడా పూర్తిగా పరిష్కరించలేకపోయారు. మీ హయాంలో రామాయంపేటకు జరిగిన అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పాలి" అని రాగి రాములు ప్రశ్నించారు.

**రూ.13 కోట్ల నిధులపై సమాధానం చెప్పాలి**

చల్మెడ రోడ్డు, రాంపూర్ రోడ్డు తదితర రహదారుల అభివృద్ధికి సంబంధించిన సుమారు రూ.13 కోట్ల నిధులు పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే మంజూరయ్యాయని రాగి రాములు తెలిపారు. నిధులు మంజూరైన అనంతరం కూడా సుమారు రెండేళ్లపాటు ఆమె ఎమ్మెల్యేగా కొనసాగారని, అయినప్పటికీ పనులు ఎందుకు పూర్తి కాలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. "మీ హయాంలోనే నిధులు వచ్చాయి.. మీరే ఎమ్మెల్యేగా ఉన్నారు.. మరి పనులు ఎందుకు పూర్తి కాలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తూ సమస్యను గుర్తించినట్లు మాట్లాడటం ఎందుకు?" అని ప్రశ్నించారు.

**ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

ప్రజా సమస్యలపై పాదయాత్రలు చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే గతంలో అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించలేని సమస్యలకు ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని రాగి రాములు అన్నారు.రామాయంపేటలో ఎవరు ఏం చేశారో ప్రజలకు తెలుసు. ఇప్పుడు పాదయాత్రల పేరుతో ప్రజల వద్దకు వెళ్లి కల్లబొల్లి మాటలు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. నిజంగా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే గతంలో జరిగిన లోపాలను అంగీకరించి ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని అన్నారు.

**ప్రతి గ్రామానికి వెళ్లే దమ్ముందా?**

నిజంగా ప్రజలపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే ఒకటి రెండు గ్రామాలకే పరిమితం కాకుండా మెదక్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలను కలవాలని రాగి రాములు సవాల్ చేశారు."నా వల్ల కాలేదు.. నేను చేయలేకపోయాను.. నా హయాంలో పనులు పూర్తికాలేదు" అని ప్రజల ముందు నిజాయితీగా అంగీకరించాలని డిమాండ్ చేశారు. మెదక్ నియోజకవర్గంపై కూడా సమాధానం చెప్పాలిరామాయంపేటతో పాటు మెదక్ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు గత పాలనలో అభివృద్ధికి దూరమయ్యాయని రాగి రాములు ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, రాజకీయ అవసరాలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వెళ్లి హామీలు ఇవ్వడం సరికాదన్నారు. "ప్రజలకు కావాల్సింది పాదయాత్రలు కాదు.. శాశ్వత పరిష్కారాలు. మాటలు కాదు.. అభివృద్ధి. హామీలు కాదు.. పనులు" అని స్పష్టం చేశారు.



**రామాయంపేట రోడ్లను వెంటనే బాగు చేయాలి**

రామాయంపేట ఉమ్మడి మండలంలోని అధ్వానంగా మారిన ప్రధాన రహదారులన్నింటినీ ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని రాగి రాములు డిమాండ్ చేశారు. చల్మెడ రోడ్డు, రాంపూర్ రోడ్డు తదితర రహదారుల పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు.

**ఇక మాటలు కాదు.. పనులు చేయాలి**

బీజేపీ తరపున తమ ప్రధాన డిమాండ్ రామాయంపేట ఉమ్మడి మండలంలోని రోడ్లను వెంటనే బాగు చేసి ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడమేనని రాగి రాములు అన్నారు. అబద్ధపు హామీలు, రాజకీయ పాదయాత్రలతో ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదన్నారు. "రామాయంపేట ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ఎవరు అధికారంలో ఉన్నారు.. ఎవరు ఏం చేశారు.. ఎవరు ఏం చేయలేకపోయారు అనే విషయాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. ఇకపై మాటలు చెప్పడం కాదు.. పనులు చేసి చూపించాలి" అని రాగి రాములు స్పష్టం చేశారు.

## పాదయాత్ర విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నమస్కారాలు

**- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఆగస్ట్ 29**

నందగోకుల్-చెల్మెడ కమాన్ రహదారి కోసం చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రకు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు, రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల సమస్య కోసం నిర్వహించిన పాదయాత్రకు ఇంతటి భారీ స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్య తీవ్రతను ఈ పాదయాత్ర ప్రభుత్వానికి మరోసారి తెలియజేసిందన్నారు.నందగోకుల్-చెల్మెడ కమాన్ రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. "ప్రజల కోసం చేపట్టిన ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదు. రోడ్డు పూర్తయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల అండతో అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం" అని అన్నారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఐక్యతే ఈ ఉద్యమానికి బలమని, రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు అందరూ ఇదే ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.







# ప్రభుత్వ సంక్షేమ పథకాలకు యుడిఐడి తప్పనిసరి

**- సూపరిండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ శివ దయాల్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**

దివ్యాంగుల సాధికార తే లక్ష్యంగా యూడీ.ఐ.డీ (UDID) శిబిరం నిర్వహించడం జరిగిందని సూపరిండెంట్ డాక్టర్ సునీత , డాక్టర్ శివదయాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం దివ్యాంగుల యూడీ.ఐ.డీ (UDID) శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ ఇండెంట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో UDID శిబిరం మెదక్, ఆగస్టు 29, 2026: మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం యూనిక్ డిజెబిలిటీ ఐడీ (UDID) కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా శనివారం UDID శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 175 స్లాట్లు కేటాయించగా,





147 మంది దివ్యాంగులు హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. విభాగాల వారీగా హాజరు వివరాలు: లోకోమోటర్ డిజెబిలిటీ: 66 మంది జనరల్ మెడిసిన్: 26 మంది కంటి వైద్య విభాగం (ఆప్తాల్మాలజీ): 18 మంది ఈఎన్‌టీ విభాగం: 20 మంది సైకియాట్రీ: 12 మంది పీడియాట్రిక్స్: 05 మంది శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన వైద్యులు దివ్యాంగులను పరీక్షించి, వారి వైకల్య శాతాన్ని నిర్ధారించే ప్రక్రియను నిర్వహించారు. అర్హులైన వారికి UDID కార్డుల జారీకి అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు సులభంగా అందేలా UDID కార్డు ప్రాముఖ్యత ఉందన్నారు.



## దాదాపు 92.86 లక్షల మంది ఓటర్ల హక్కులను కాపాడాలి!

**-దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్2026 గడువును మరో 4 వారాల పాటు పొడిగించాలని గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిలకు లేఖ రాయడం అత్యంత సమయోచితమైన నిర్ణయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ఈ తొలగింపుకు ముఖ్య కారణం,సరైన సమయం లేకపోతే దాదాపు 92.86 లక్షల మంది అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తపరిచారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు విలువైనది. ఎవరూ తమ ప్రాథమిక హక్కును కోల్పోకుండా చూసేందుకు ఎన్నికల సంఘం తక్షణమే ఈ గడువును పొడిగించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలందరూ తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.




## పోతారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

మనోహరాబాద్ మండలం పోతారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ పాలకవర్గం సభ్యులతో కలిసి అర్హులైన గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం అందించే కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పేద మరియు అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి పేద కుటుంబాలకు అండగా నిలిచి, వారికి అవసరమైన సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గమ్మ,వార్డు సభ్యులు సురేష్, పవన్ గౌడ్,శ్రీకాంత్, గ్రామ పెద్దలు సత్తయ్య, రాములు, మల్లారెడ్డి, మల్లేష్ గౌడ్, రమేష్ యాదవ్, కుమార్, నరసింహారెడ్డి, భూపాల్ రెడ్డి, ఆంజనేయులు, యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత ప్రజలు పాల్గొన్నారు.

# 22A నిబంధనపై బాధితుల గళం.. బీరంగూడలో వెల్లువెత్తిన ప్రజా ఆగ్రహం





*** మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో 500 బైకులతో జీఎంఆర్ కన్వెన్షన్ వరకు భారీ ర్యాలీ**

*** బాధితులను ఏకం చేసి ఉద్యమ స్ఫూర్తి నింపిన నరసింహ గౌడ్‌ను ప్రశంసించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

*** 22A నిబంధనను ఎత్తివేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు: హరీష్ రావు**

**అమీన్‌పూర్, ఆగస్టు 29, సిద్దిపేట టైమ్స్ :**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివాదాస్పద 22A నిబంధనతో సామాన్య ప్రజలు, రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని, బాధితుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

పటాన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో 22A సమస్యపై నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ డివిజన్ నుండి వందలాది మంది బాధితులతో కలిసి సుమారు 500 బైకులతో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గులాబీ జెండాలతో, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీరంగూడ నుండి జీఎంఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ఈ ర్యాలీతో రహదారులు గులాబీమయమయ్యాయి.

**బాధితులకు అండగా నందారం నరసింహ గౌడ్.. నేతల అభినందనలు:**

జీఎంఆర్ కన్వెన్షన్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "22A నిబంధన తీవ్రతను, దానివల్ల ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నందారం నరసింహ గౌడ్ చూపిన చొరవ అభినందనీయం. బాధితులందరినీ ఏకం చేసి, ఇంతటి భారీ ఎత్తున 500 బైకులతో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి ప్రజా చైతన్యం కల్పించడం గొప్ప విషయం" అని ప్రత్యేకంగా కొనియాడారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. "భూమి మా హక్కు బతుకు మా హక్కు" అని, ప్రజలు కష్టపడి సంపాదించుకున్న భూములకు 22A పేరుతో రిజిస్ట్రేషన్లు ఆపడం కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి ప్రజల కష్టార్జితాన్ని లాక్కునే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వం మెడలు వంచైనా 22Aను ఎత్తివేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎన్ జి యువసేన సభ్యులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, 22A బాధితులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.







# 22A నిబంధనపై జీఎంఆర్ కన్వెన్షన్‌కు పోటెత్తిన బాధితులు

*** మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 22A బాధితులు,కాలనీ వాసులతో భారీ ర్యాలీ**

*** 22A నిబంధనను ఎత్తివేసేంత వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం: మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.**

**అమీన్‌పూర్, ఆగస్టు 29, సిద్దిపేట టైమ్స్ :**





రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివాదాస్పద 22A నిబంధనతో సాధారణ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బాధితుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి అధ్యక్షతన 22A సమస్యపై నియోజకవర్గ స్థాయి విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**బాధితులతో కలిసి తరలివచ్చిన తుమ్మల పాండురంగారెడ్డి గారు:**

ఈ కార్యక్రమానికి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 22A నిషేధించబడిన కాలనీలకు చెందిన బాధితులను ఏకం చేస్తూ, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అమీన్‌పూర్ నుంచి బాధితులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చి జీఎంఆర్ కన్వెన్షన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై నిరసన తెలుపుతూ, బాధితుల గళాన్ని బలంగా వినిపిస్తూ సాగిన ఈ ర్యాలీ అందరి దృష్టిని ఆకర్షించింది.

**బాధితులకు అండగా ఉంటాం.. నేతల ప్రశంసలు:**

జీఎంఆర్ కన్వెన్షన్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "అమీన్‌పూర్ పరిధిలోని 22 A నిషేధించబడిన కాలనీల ప్రజలు, 22A బాధితులను సమన్వయం చేసుకుంటూ ఇంతటి భారీ సంఖ్యలో సభకు తీసుకొచ్చి ప్రజా సమస్యను ఎలుగెత్తి చాటిన తుమ్మల పాండురంగారెడ్డి కార్యాచరణ అభినందనీయం" అని ప్రశంసించారు. ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ..పటాన్చెరు నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల భూములు 22A నిషేధిత జాబితాలో ఉండటంతో భూ యాజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 22A కారణంగా భూములను విక్రయించుకోలేకపోవడంతో పాటు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారని, వ్యవసాయ భూములకు రైతుబంధు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు కూడా అందడం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.







## బిజెపి నేతలను సన్మానించిన సమీర్

**-పాలమూరులో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



మహబూబ్ నగర్ జిల్లా బిజెపి కార్యాలయంలో శనివారం పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన బిజెపి నేతలను దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండల మైనార్టీ యువ మోర్చా అధ్యక్షుడు ఎండి సమీర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు తో పాటు తెలంగాణ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ జగన్మోహన్ సింగ్, పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మలను సమీర్ మర్యాద పూర్వకంగా కలిసి వారికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి నూతనంగా ఎన్నికైన మైనార్టీ మోర్చా అధ్యక్షులు మరియు వివిధ యువమోర్చాల అధ్యక్షులు పాల్గొన్నట్లు సమీర్ తెలిపారు.



## యువత క్రీడలపై దృష్టి సారించాలి

**- ఎస్సై అపూర్వ రెడ్డి**

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్ లకు బానిసలై క్రీడలను మరుస్తున్నారని వాటిని పక్కన పెట్టి క్రీడలపై దృష్టి సారించాలని చేర్యాల ఎస్సై అపూర్వరెడ్డి సూచించారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను అభిమానులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 50 మంది పిల్లలు, యువత ప్రతిరోజు పోలీస్ స్టేషన్లో వాలీబాల్ ఆడేందుకు వస్తున్నారని ఈ విషయములో పీఈటి తాడెం రమేష్ కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు యువత పాల్గొన్నారు.

## పూజలందుకొన్న బాలాంజనేయ స్వామి



**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పురోహితుడు రాజమూరి హన్మేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## నిరుపేద గుండెకు చేరువవుతున్న సరోజ్ రెడ్డి



**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి నిరుపేద గుండెలకు చేరువవుతున్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. ప్రతినిత్యం ప్రజల మధ్య ఉండడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. దీంతో నియోజక వర్గంలోని ప్రజల ప్రతి ఒక్కరి హృదయాల్లో చెరగని ముద్ర వేస్తున్నారని పార్టీ నాయకులు అంటున్నారు. అందుకే అలుపెరుగని నాయకుడిగా ఆయన నియోజకవర్గంలో పేరు ప్రతిష్టలు సంపాదించుకుంటున్నారని వారంటున్నారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడి ఆర్థిక సహాయం

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం ఏదులపురంలో పలు కుటుంబాలను పరామర్శించి శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. వారి ఆర్థిక పరిస్థితులను చూసి సమస్యలను అడిగి తెలుసుకుని చలించిన భాస్కర్ రెడ్డి అన్న ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన మేరకు ఈ ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలను అన్ని రకాలుగా ఆదుకోవాలని లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆ దిశగానే ఎమ్మెల్యే జిఎంఆర్ నియోజకవర్గంలో నిరుపేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజల కష్టాల్లో పాల్పంచుకుంటూ ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు గౌడ్ నాయకులు మధుసూదన్ రెడ్డి, అంజన్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, లక్ష్మణ్, మానస, నరసింహ గౌడ్, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**




ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం, హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుంచి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని *సీఈఓకు, కలెక్టర్ వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మెదక్ ఆర్డీవో రమదేవి, ఎలక్షన్ సూపరింటెండెంట్ గఫార్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టరేట్ ముట్టడిస్తాం.. 22A తొలగించేదాకా అక్కడే వంటావార్పు: హరీశ్ రావు హెచ్చరిక

- **పటాన్ చెరువులోనే లక్ష ఇళ్లు, 50 వేల ఎకరాలు 22Aలో పెట్టడం దారుణం.**
- **ఒక్క పటాన్ చెరువులోనే 50 వేల ఎకరాలు, లక్ష ఇండ్లను 22A లో పెట్టి పేద, మధ్యతరగతి - ప్రజల కష్టార్జితాన్ని రేవంత్ ప్రభుత్వం కబ్జా చేస్తోంది.**
- **రేవంత్ రెడ్డి, పొంగులేటి ఆస్తులు మాత్రం రాత్రికి రాత్రే జాబితా నుంచి ఎలా తీశారు?**
- **అప్లికేషన్ లేకుండా ముఖ్యమంత్రి, మంత్రి ఆస్తులు ఎలా తొలగించారు.**
- **ఆస్తులు 22Aలో పెట్టి, 30-40 ఏళ్లుగా ఉంటున్న వారిని కబ్జాదారులు అంటారా☐**
- **98% జాబితా నుంచి తీశామని బొంకులేటి మళ్లీ బొంకుతున్నారు.**
- **రేవంత్ రెడ్డికి సంబంధం లేకపోతే పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి.**
- **వారం రోజుల్లో 22A సమస్య పరిష్కరించకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి.**
- **రెవెన్యూ మంత్రి పొంగులేటి కాదు.. ఆయన ప్రజలను లూటీ చేసే 'పొంగులూటి'.**
- **98% జాబితా నుంచి తీశామని ఆ 'బొంకులేటి' మళ్లీ బొంకుతున్నారు.**
- **ఈ 22A దందాతో రేవంత్ రెడ్డికి సంబంధం లేకపోతే మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి.**




**పటాన్చెరు, ఆగష్టు 29, సిద్దిపేట టైమ్స్ :**

పటాన్ చెరువు నియోజకవర్గ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన 22A భూముల బాధితుల సమావేశానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, 22A బాధిత కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.సమావేశంలో బాధితులు తమ ఆవేదనను హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చారు. దశాబ్దాలుగా ఉంటున్న ఇళ్లను కూలగొడుతున్నారని, రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని, లంచాలు ఇవ్వాలని ఎమ్మార్వోలు బెదిరిస్తున్నారని వాపోయారు.సింఫోని కాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన బాధితుల కన్నీటి గోసను విన్న హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటిల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.....మా మీద వ్యక్తిగతంగా ఎన్ని కుట్రలు చేసినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల కోసం పోరాడే శక్తిని భగవంతుడు మాకు ఇచ్చాడు.

తెలంగాణ ఉద్యమంలో కూడా ఇవే దౌర్జన్యాలు చూశాం. అయినా కేసీఆర్ గారి నాయకత్వంలో పోరాడి తెలంగాణ సాధించుకున్నాం.

ఈరోజు 22A బాధితుల కన్నీళ్లు చూస్తుంటే ఈ రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థమవుతోంది. పిచ్చోడి చేతిలో రాయిలాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తయారైంది.1980లో లేఅవుట్ చేసి, 46 ఏళ్లుగా కాలనీల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తుంటే.. ఇప్పుడు వాటిని నిషేధిత జాబితాలో పెట్టి పిల్లల పెళ్లిళ్లు, చదువులు ఆపేస్తున్నారు. బ్యాంక్ లోన్లు రాకుండా చేస్తున్నారు.

ఇల్లంటే ఒక మనిషి జీవితకాల కల. పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే, రాత్రికి రాత్రి నిషేధిత జాబితాలో పెట్టి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు.

హుడా పర్మిషన్లు, మున్సిపల్ పర్మిషన్లు, కరెంట్, నల్లా కనెక్షన్లు ఇచ్చి.. ప్రాపర్టీ టాక్స్‌లు వసూలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు మీ ఆస్తులు 22Aలో ఉన్నాయని ఇళ్లను కూల్చేయడం దుర్మార్గం.

ఒక ఎమ్మార్వో ఏకంగా రెండు కోట్ల రూపాయలు లంచం అడిగాడని, హైకోర్టు అక్షింతలు వేసినా పట్టించుకోకుండా ఇల్లు కూలగొట్టి తనను రోడ్డున పడేశారని ఇక్కడ ఓ బాధితుడు కన్నీరుమున్నీరుగా చెబుతుంటే ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్లైనా లేదా?

రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో రాష్ట్రాన్ని పెట్టి రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి చోద్యం చూస్తున్నారా?

రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఏమాత్రం రక్షణ లేదు.ఒక్క పటాన్ చెరువు నియోజకవర్గంలోనే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇండివిడ్యువల్ ఇళ్లు కలిపి దాదాపు లక్ష ఇండ్లను 22A జాబితాలో పెట్టారు.గుమ్మడిదలలో 12,432 ఎకరాలు, అమీన్‌పూర్‌లో 3,200 ఎకరాలు, రామచంద్రాపురంలో 8,300 ఎకరాలు, పటాన్ చెరువులో 12,300 ఎకరాలు, జిన్నారంలో 13,900 ఎకరాలు.. ఇలా మొత్తం ఐదు మండలాల్లో కలిపి 50,565 ఎకరాల ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు.పటాన్ చెరువు అంటేనే మధ్యతరగతి, పేద ప్రజలు, చిరుద్యోగులు ఉండే ప్రాంతం. ఏ పాపం తెలియని వీరి మీద కాంగ్రెస్ ఎందుకు ఇంత కక్ష సాధింపులకు పాల్పడుతోంది? భూములు నిషేధిత జాబితాలో పెడితే వాళ్లకు రైతుబంధు రాదు, రైతు బీమా రాదు, పంట అమ్ముకుంటే కనీస మద్దతు ధర కూడా రాదు. ఈ దుర్మార్గం కేవలం పటాన్ చెరువుకే పరిమితం కాలేదు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కుత్బుల్లాపూర్, మలక్ పేట, ఉప్పల్.. ఇలా హైదరాబాద్ చుట్టుపక్కల ఏ ప్రాంతానికి వెళ్లినా లక్షల ఆస్తులను 22A లో పెట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఇల్లు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు కూడా 22A నిషేధిత జాబితాలోనే పడ్డాయి.ఆ విషయం నేను బయటపెట్టగానే, ఎలాంటి అప్లికేషన్ లేకుండా, రాత్రికి రాత్రే వాళ్ళ ఇళ్లను జాబితా నుంచి ఎలా తొలగించారు?మీకు అధికార బలంతో ఆస్తులను కాపాడుకునే ప్రత్యేక చట్టం ఉందా? అప్లికేషన్ పెట్టకుండా మీ ఆస్తులను ఎలా తీశారో.. అదే విధంగా లక్షలాది మంది సామాన్యుల ఆస్తులను ఎందుకు 22A నుంచి తీయడం లేదో రేవంత్ రెడ్డి, పొంగులేటి సమాధానం చెప్పాలి.మీ తప్పులను సరిదిద్దుకుని ప్రజలను క్షమాపణ అడగాల్సింది పోయి.. బాధితులను, 30 ఏళ్లుగా నివసిస్తున్న వారిని ముఖ్యమంత్రి కబ్జాదారులు అనడం ఆయన అహంకారానికి నిదర్శనం.

**రెవెన్యూ మంత్రి పొంగులేటి కాదు.. ఆయన ప్రజలను లూటీ చేసే పొంగులూటి.**

98 శాతం 22A సమస్యను పరిష్కరించామని మొన్న ఆయన బొంకుతూ చెప్పుకొచ్చారు. 98 శాతం జాబితా నుంచి తీసేసినట్లయితే ఒక్క పటాన్ చెరువులోనే ఇంకా 50,000 ఎకరాలు, లక్షల ఇళ్లు నిషేధిత జాబితాలో ఎందుకున్నాయ్ మిస్టర్ బొంకులేటి..

తప్పు మంత్రి పొంగులేటి చేసి, శిక్ష ప్రజలు ఎందుకు అనుభవించాలి.. రేవంత్ రెడ్డి గారూ, ఈ 22A దందాలో మీకు సంబంధం లేకపోతే వెంటనే పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. ఒకవేళ అధికారులే పొరపాటు చేశారనుకుంటే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.

**నీ అత్యాశే రేపటి నీ దుఃఖానికి కారణమవుతుంది పొంగులేటి గారూ రాసి పెట్టుకోండి.**

అమీన్‌పూర్‌కు తాగునీరు రావడం లేదని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అడగ్గానే, బ్యాంకులో డబ్బులు కట్టి పైప్‌లైన్ వేయించి ఇంటింటికీ నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ గారిది. ఐటీఐ కావాలన్నా, పాలిటెక్నిక్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కావాలన్నా మంజూరు చేశాం.జీవో 58, 59 కింద ఒక్క పటాన్ చెరువులోనే 9 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, రూపాయి ఖర్చు లేకుండా వాళ్లను ఓనర్లను చేసిన పాలకుడు కేసీఆర్.సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు, రేవంత్ రెడ్డి కేవలం భూముల చుట్టూనే తిరుగుతాడు. కేసీఆర్ పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తే, రేవంత్ రెడ్డి వాళ్ల ఇళ్లను కూలగొట్టి రోడ్డున పడేస్తున్నాడు. పటాన్ చెరువు నియోజకవర్గ ప్రజల పక్షాన సంగారెడ్డి కలెక్టర్‌ను హెచ్చరిస్తున్నాను. వారం రోజుల లోపల స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గారు 50 వేల ఎకరాల నిషేధిత జాబితాను మీకు పంపిస్తారు. వారం రోజుల్లోగా ఆ భూములను, ఇళ్లను 22A నుంచి బేషరతుగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం.లేదంటే 50 వేల ఎకరాల రైతులు, లక్షల ఇండ్ల వాసులను కలుపుకుని, ఎమ్మెల్యే, నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం. వంటావార్పు చేసి, నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించేదాకా అక్కడే బైఠాయిస్తామని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




## అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

**సిద్దిపేట టైమ్స్, తూప్రాన్ :-**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ తొమ్మిదవ వార్డులో నిబంధనలు అతిక్రమించి సెట్ బ్యాక్ ఇవ్వకుండా రెడ్డి సంఘం నిర్మాణం చేస్తున్నారని వెంటనే అట్టి నిర్మాణాన్ని ఆపి కాలనీవాసులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదవ వార్డులో జరుగుతున్న రెడ్డి సంఘం నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందనే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కు వ్రాతపూర్వకంగా కాలనీవాసులు ఫిర్యాదు చేశారని దీనికి అధికారులు నిర్మిత స్థలాన్ని పరిశీలించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇదే అదనుగా భావించి నిర్వాహకులు సంఘం నిర్మాణం వేగవంతం చేశారని పేర్కొన్నారు.కాలనీ కార్నర్ మధ్యన భవనం నిర్మించడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదలు జరిగే అవకాశలు ఉన్నాయని అన్నారు. నిర్మాణదారులు 30 పీట్ల రోడు వదిలి నిర్మాణం చేపట్టాలని ఇట్టి సామూహిక నిర్మాణం చేపట్టడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలేత్తుతాయని తెలిపారు.నిబంధనలు అతిక్రమించి సెట్ బ్యాక్ ఇవ్వకుండా చేపట్టిన ఇట్టి నిర్మాణాన్ని ఆపివేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపాలిటీ తొమ్మిదవ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజాసేవలోనే నిజమైన సంతృప్తి.. మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్

**- అచ్చుమాయిపల్లిలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక, ఆగస్టు 29**

ప్రజాసేవలోనే తనకు నిజమైన సంతృప్తి కలుగుతుందని మాజీ ఎంఎల్ సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. ఆర్థికంగా ఉన్నవారు, వ్యాపారస్తులు, ఉద్యోగులు సేవా దృక్పథాన్ని అలవర్చుకొని తమ సంపాదనలో కొంత భాగం నిరుపేదలకు ఇవ్వాలని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి లోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ లకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, ఎగ్జామ్స్ ప్యాడ్ లను మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తన కుటుంబ సభ్యులు, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ పర్స దేవరాజు ముదిరాజ్ తో కలిసి ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ దేవరాజు వినతి మేరకు త్వరలోనే పెద్దచీకోడు, అచ్చుమాయిపల్లి గ్రామాలకు ఫ్రీజర్ లను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణ, విలువలతో కూడిన మెరుగైన విద్య అందుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నుంచి పీఎం మోదీ, రాష్ట్రపతి ముర్మూ వరకు ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని నొక్కి చెప్పారు. సొంత బిల్డింగ్ లలో ప్రభుత్వ పాఠశాలలు, సుశిక్షితులైన ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతి గదులు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. సర్కార్ బడుల్లోనే సత్తా ఉన్న ఉపాధ్యాయులున్నారని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బందులకు గురి కావద్దని కోరారు. తన కుమార్తె, కుమారుణ్ణి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం పట్ల సర్పంచ్ దేవరాజ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు, యుపిఎస్ ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి సిబ్బంది, పలువురు పంచాయతీ కార్మికులు, గ్రామస్తులకు చేనేత శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆతర్వాత సర్పంచి దేవరాజు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపతి మైసయ్య, వార్డు సభ్యులు రమేష్, రాజు, మహేష్, నవ్య, రమేష్, మల్లికార్జున్, రోజా రమేష్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, చీకోడ్ కాంప్లెక్స్ హెచ్ఎం బాలరాజు, యుపిఎస్ హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఏ ఏపీసీ చైర్ పర్సన్ మమత అంగన్వాడీ టీచర్ పద్మ, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.












# కన్నుల పండువగా రాజరాజేశ్వరుడి రథోత్సవం

**- 200 ఏళ్లుగా స్వామివారి రథం ఊరేగింపు..**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక, ఆగస్టు 29**

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో ప్రతి ఏటా శ్రావణమాసంలో రాఖీ పౌర్ణమి పండుగ మరుసటి రోజున నిర్వహించే శ్రీ రాజరాజేశ్వరుడి (పెద్ద గుడి) రథోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో కనుల పండువగా జరిగింది. విశేష పూజలు నిర్వహించిన అనంతరం రాజరాజేశ్వర స్వామి వారి రథాన్ని ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా 10 వ, 11 వ వార్డుల కౌన్సిలర్లు బడుగు రాజు, నందాల శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య, మాజీ ఎంపిటిసి ఇంగు శోభ మాట్లాడుతూ, లచ్చపేట లో 200 ఏళ్ల క్రితం నిర్మించిన అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ రాజ రాజేశ్వర దేవాలయం అత్యంత ప్రసిద్ధి చెందినదని తెలిపారు. 200 ఏళ్లుగా తమ పూర్వీకుల వారసత్వ సంసృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి రథోత్సవం ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధిరాములు, ఆలయ కమిటీ సభ్యులు అనిల్, మురళి, లిటిల్, రవి, శ్రీశైలం, శివ, అర్జున్, యాదగిరి, రమేష్, ప్రవీణ్, మదన్మోహన్, పలు కుల సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# గుడుగుపల్లిలో ఘనంగా దుర్గమ్మ తల్లి బోనాలు

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:**

దౌల్తాబాద్ మండల పరిధిలోని గుడుగుపల్లి గ్రామంలో దుర్గమ్మ తల్లి కళ్యాణోత్సవం, మైసమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు దుర్గమ్మ తల్లి కళ్యాణోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం మైసమ్మ, పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు బోనాల కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల నినాదాలు, డప్పు చప్పుళ్లతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని స్థానిక సర్పంచ్ మద్దెల వనజ స్వామి అమ్మవార్లను వేడుకున్నారు. ఉత్సవాల్లో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు 5 కిలోమీటర్ల రన్నింగ్ లో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన క్రీడాకారులు , క్రీడాభిమానులలో స్ఫూర్తిని ఉత్సాహాన్ని నింపిన మెదక్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్ జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు చౌరస్తా నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు పురుషులకు ఐదు కిలోమీటర్ల రన్నింగ్, అలాగే మెదక్ కొత్త బస్టాండ్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండాతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. మన మెదక్ జిల్లాలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించుకోవడం శుభపరిణామం అని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్రీడాకారుల విద్యార్థులు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలు రాణిస్తున్నారని పేర్కొన్నారు.. క్రీడలలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడ లభిస్తాయి అన్నారు. అనంతరం ధ్యాన్చంద్ చౌరస్తా వద్ద ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్ అహ్మద్ , స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శివ, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్, ,పాల్గొని ధ్యాన్చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు అనంతరం క్రీడాకారులు క్రీడాభిమాను ఉద్దేశించి వక్తలు తమ సందేశాలను వినిపించారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, సమష్టితత్వం పెంపొందించడమే లక్ష్యంగా పురుషులకు ఐదు కిలోమీటర్ల, బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదగా మెడల్స్ అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం,ఫుట్బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు




# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే పోరాటం

**- రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఆగస్టు 29:**

రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను ఆదుకోవాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్లో జిల్లా రెడ్డి జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 8న హైదరాబాద్లో నిర్వహించే నిరసన దీక్ష పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నప్పటికీ రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజిక వర్గాన్ని ఆదుకుంటామని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పలు రెడ్డి బహిరంగ సభల్లో హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రెండేళ్ల క్రితం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గం కోసం హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమిని కేటాయించిందని, ప్రస్తుతం ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు బీమా పథకాన్ని కూడా ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.రెడ్డి సామాజిక వర్గం సమస్యలు, హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మందితో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సెప్టెంబర్




8న నిర్వహించనున్న నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి విడుదల చేశారు.జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అయిలేని మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెడ్డిల హక్కుల సాధన కోసం అవసరమైనన్ని పోరాటాలు చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిర్వహించే నిరసన దీక్షను జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షులు మా రెడ్డి రాంలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ముక్కిస తిరుపతిరెడ్డి, దుర్గారెడ్డి, ఇర్రి ఉమారెడ్డి, చల్లారం పద్మారెడ్డి, వంగ శైలజారెడ్డి, గూడ పద్మారెడ్డి, పాతూరి వెంకట్‌రెడ్డి, పార్థివరెడ్డి, సంతోష్‌రెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, అయిలేని గాల్‌రెడ్డి, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గూడ బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రశ్నించేతత్త్వం నేర్చుకోవాలి

**--- అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు.**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఆగస్టు 29**

శనివారం రోజున అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంగునూరు మండలంలోని రాజగోపాలపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి 10,800 విలువైన బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు విద్యార్థులు విషయ అవగాహన పెంచుకుని సర్వతోముఖాభివృద్ధి సాధించాలని అన్నారు. ప్రశ్నించే తత్త్వం పెంచుకుంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారు అన్నారు. బహుమతుల ప్రధాత ఫౌండేషన్ కోశాధికారి గుజ్జు అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడి అంటే పేద పిల్లలు ఉండే బడి కాదు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉండే బడి అని అందరూ విద్యార్థులు ఉపాధ్యాయుల మాట వింటూ అన్ని పోటీలలో పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు కనకయ్య గారు సభాధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు బైతి దుర్గయ్య గారు, ప్రతినిధులు మహేష్, ప్రణయ్, జగదీష్, నవీన్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# త్రిబుల్ ఆర్ భూసేకరణలో మెదక్ జిల్లా రెవిన్యూ నేషనల్ హైవే, సమన్వయం ప్రశంసనీయం



**- ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి గంగాధర్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**

భూసేకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షల ద్వారా పటిష్ట చర్యలు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులతో త్రిబుల్ ఆర్ భూ సేకరణ పై కలెక్టరేట్లో సమీక్ష త్రిబుల్ ఆర్ భూ సేకరణ ప్రక్రియలో మెదక్ జిల్లా అధికారుల సమన్వయం మరువలేనిదని ఆర్ అండ్ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, నేషనల్ హైవే, రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. ముందుగా భూసేకరణ పురోగతిపై నర్సాపూర్ తూప్రాన్ ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్ (RRR) ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై ప్రభుత్వం ఆదేశాల మేరకు భూసేకరణ పై జిల్లాల వారీగా రివ్యూ నిర్వహించి మెదక్ జిల్లాకు రావడం జరిగిందని. మిగతా జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లా జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక చొరవతో భూ సేకరణలో ఉత్తమ ప్రతిభలో ఉందన్నారు. అవార్డు పాసైన భూములను భూమి రాసి పోర్టల్ లో నమోదు చేయడం, రైతులకు. పేమెంట్ అందేలాచర్యలు తీసుకోవడం విషయాలపై చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ భూసేకరణలో మెదక్ జిల్లాలో పూర్తి పారదర్శకత జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు.. అవార్డు పాసైన వాటికి వెంటనే డబ్బులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి చేయడం ద్వారా రింగ్ రోడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని , తెలిపారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ,భూ సేకరణ కన్సల్టెంట్ సుందర్ అద్నాన్ , నేషనల్ హైవే పిడి మాధవి, నేషనల్ అవే మేనేజర్ రాహుల్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో బావయ్య, కలెక్టరేట్ సూపరిండెంట్ గఫర్ ,మండల తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు



# గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**



మెదక్ జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్యం లక్ష్యం PACS లలో గోదాముల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.
మెదక్ జిల్లా కలెక్టరేట్లో శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (DCDC) సమావేశంను కన్వీనర్ / మెదక్ జిల్లా సహకార అధికారి. పద్మ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..సహకార శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వల పథకం ద్వారా కింద మన జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) ల స్థాయిలో ధాన్య నిల్వ గోదాముల నిర్మాణం, భూ కేటాయింపు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లాకు నిర్దేశించిన 30,000 మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్య లక్ష్యాన్ని సాధించే దిశగా జిల్లాలోని అనువైన PACS లను గుర్తించి గోదాముల నిర్మాణం చేపట్టాలని సమావేశంలో చర్చించారు. ఈ పథకం కింద PACS స్థాయిలో గోదాముల ఏర్పాటుతో రైతులకు స్థానికంగానే ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు, పంటను వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితిని తగ్గించడం, ధాన్య నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.సమావేశంలో యెల్దుర్తి PACS రంగంపేట PACS లలో గోదాముల నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలను పరిశీలించారు. అలాగే FSCS కోతపల్లి, PACS కల్వకుంట , PACS చీకోడు లకు గోదాముల నిర్మాణం కోసం భూ కేటాయింపు అంశంపై కూడా చర్చించారు. సంబంధిత శాఖల సమన్వయంతో భూమి కేటాయింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అంశాన్ని పరిశీలించారు.ధాన్య నిల్వ గోదాముల నిర్మాణానికి సంబంధించి ఎఫ్సీఐ (Food Corporation of India) తో పాటు సంబంధిత సంస్థల అవసరాలు, ధాన్య నిల్వకు ఉన్న డిమాండ్, నిల్వ సామర్థ్యం మరియు భౌగోళిక అనుకూలతలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు .ఎఫ్సీఐ అధికారుల పరిశీలన అనంతరం గుర్తించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని, జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో గోదాముల నిర్మాణాన్ని వేగవంతం చేయడం ద్వారా నిర్దేశిత నిల్వ సామర్థ్య లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారుముఖ్యంగా జిల్లాలో PACS లను బలోపేతం చేయడంతో పాటు, ధాన్య నిల్వ, సేకరణ, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పీఏసీఎస్ స్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అంబదాస్ రాజేశ్వర్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ . Additional DRDO సరస్వతి, CEO జెడ్పీ ఎల్లయ్య, , సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరులో పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఆగస్టు 28:**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలను నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచా పేల్చారు. పూజల హరికృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పూజల హరికృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, రాపోల్ రాజహుదూర్ రెడ్డి, ఎండీ ఇమ్రాన్, కర్ణకంటి రవీంద్రచారి, సర్పంచులు రాధాకృష్ణ, మైపాల్ రెడ్డి, రంగు అశోక్, రంగారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ డ్డి, జీవన్ నాయక్, ప్రభాకర్, సామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కాటన్ కనకయ్య, చిన్న అజ్మత్, వెంకటేష్, రమేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వహించాలి

**- పోలీసు పరేడ్‌ను పరిశీలించిన డీఎస్పీ ప్రసన్న కుమార్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు 29**



విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ సూచించారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వారాంతపు పోలీసు పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి డీఎస్పీ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా, అంకిత భావంతో నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్తులపై చర్యలు తీసుకోవడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేలా వృత్తిపరమైన నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. పోలీసు పరేడ్‌లు క్రమశిక్షణతో పాటు సిబ్బందిలో ఐక్యత, బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు.ఈ పరేడ్ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో కాంగ్రెస్‌కు తప్ప మరో పార్టీకి అవకాశం ఉండదు : కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**- రానున్న పదేళ్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే.. ఆ తర్వాత కూడా పార్టీ బలోపేతానికి కృషి**

**- రాబోయే ఎన్నికల్లో భార్య నిర్మల.. ఆ తర్వాత ఆంజనేయులు పోటీ**

**- ప్రత్యర్థులు ఎన్ని వ్యూహాలు పన్నినా రాజకీయంగా తిప్పికొడతా**

**సిద్దిపేట టైమ్స్ మెదక్ ప్రతినిధి ఆగస్టు29**



సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలుస్తారని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అనంతరం కూడా మరో పార్టీకి అవకాశం రాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య నిర్మల పోటీ చేస్తారని, ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో ఆంజనేయులు బరిలో ఉంటారని తెలిపారు. తాను స్వయంగా ఎన్నికల బరిలో ఉంటే గెలుపు కోసం ఎంత కసితో పనిచేస్తానో, పార్టీ అభ్యర్థి పోటీ చేసినప్పుడు అంతకంటే ఎక్కువ పట్టుదలతో పనిచేస్తానని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతిపక్ష పార్టీలు ఎన్ని వ్యూహాలు రచించినా రాజకీయంగా వాటిని తిప్పికొడతానని అన్నారు. ఎవరెన్ని డైలాగులు కొట్టినా, ప్రత్యర్థులు తమ సర్వశక్తులు ఒడ్డినా తాను రూపొందించిన రాజకీయ వ్యూహం ముందు వారి ఎత్తులు పనిచేయవని ధీమా వ్యక్తం చేశారు.“ఎవరెన్ని డైలాగులు కొట్టినా.. ప్రత్యర్థి సర్వం ఒడ్డినా.. నేను గీసిన డిజైన్ ముందు అపోజిషన్ వ్యూహాలు పనిచేయవు” అని స్పష్టం చేశారు.డబ్బు ఉంటేనే రాజకీయాల్లో విజయం సాధించగలమని భావించడం భ్రమ అని అన్నారు. తాను కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, అనంతరం మూడుసార్లు ఎమ్మెల్యేగా డబ్బు బలం లేకుండానే గెలిచానని పేర్కొన్నారు. ప్రజల నమ్మకం, సంబంధాలు, సేవా కార్యక్రమాలే రాజకీయాల్లో తనకు బలమని తెలిపారు.

సాధారణ సమయాల్లోనే కాకుండా ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు కూడా రాజకీయాలకు అతీతంగా ఆర్థికంగా సహాయం చేశానని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం తన రాజకీయ ప్రస్థానంలో భాగమన్నారు.

రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో డబ్బు ప్రభావం చూపవచ్చని, కానీ ప్రతి ఎన్నికలోనూ డబ్బుతోనే విజయం సాధించడం సాధ్యం కాదని అన్నారు. ప్రజల విశ్వాసం, నాయకత్వంపై నమ్మకం, నిరంతర ప్రజాసేవే శాశ్వత రాజకీయ బలమని పేర్కొన్నారు.




## విద్యార్థులు ప్రశ్నించేతత్త్వం నేర్చుకోవాలి



**--- అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు.**

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఆగస్టు 29:**

అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంగునూరు మండలంలోని రాజగోపాలపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి 10,800 విలువైన బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు విద్యార్థులు విషయ అవగాహన పెంచుకుని సర్వతోముఖాభివృద్ధి సాధించాలని అన్నారు. ప్రశ్నించే తత్త్వం పెంచుకుంటేనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారు అన్నారు. బహుమతుల ప్రధాత ఫౌండేషన్ కోశాధికారి గుజ్జు అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడి అంటే పేద పిల్లలు ఉండే బడి కాదు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉండే బడి అని అందరూ విద్యార్థులు ఉపాధ్యాయుల మాట వింటూ అన్ని పోటీలలో పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు కనకయ్య గారు సభాధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు బైతి దుర్గయ్య గారు, ప్రతినిధులు మహేష్, ప్రణయ్, జగదీష్, నవీన్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.





## సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు

**- వేలాదిగా హాజరై ప్రజా నాయకునికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు#**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఆగస్టు 29**



సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గౌ. పూజల హరికృష్ణ గారి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి పూజల హరికృష్ణ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హరికృష్ణ గారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. పూజల హరికృష్ణ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలతో పాటు సిద్దిపేట పట్టణంలో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పేదలు, నిరుపేదలకు సహాయం చేయడంతో పాటు వివిధ స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా సేవే లక్ష్యంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలు హరికృష్ణ గారి జన్మదిన వేడుకలకు ప్రత్యేకతను తీసుకువచ్చాయి.ఈ సందర్భంగా పూజల హరికృష్ణ గారు మాట్లాడుతూ, తన జన్మదిన వేడుకలకు హాజరై తనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపిన ప్రేమ, అభిమానం, ఆప్యాయతలను ఎప్పటికీ మరువలేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో మరింతగా ప్రజలకు సేవ చేయడానికి కృషి చేస్తానని హరికృష్ణ గారు పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ఉన్న ఐదు మండల కేంద్రాల లో మండలాల అధ్యక్షులు amc వైస్ చైర్మన్స్ మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు మరియు అలాగే సిద్దిపేట పట్టణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్ ఆధ్వర్యం లో వివిధ ప్రాంతాల్లో జన్మదిన వేడుకలు, ఘనంగా నిర్వహించారు అలాగె కాంగ్రెస్ శ్రేణులు వివిధ సేవా కార్యక్రమాలు చేసి పూజల హరికృష్ణ గారి పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో ఉన్న అభిమానం, ప్రజా సేవ పట్ల వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయి.

**కార్యక్రమంలో పాల్గొన్న వారు:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంప మైందారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్, బొమ్మల యాదగిరి, కలిముద్దీన్ అహ్మద్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, దాసం జన్న, అర్బన్ మండల అధ్యక్షులు బిక్షపతి, రూరల్ మండల నాయకులు గుర్రం అంజిరెడ్డి, రాములు, మైనారిటీ జిల్లా అధ్యక్షులు రషాద్, గాయశుద్దీన్,అర్షద్,కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్,టీఎంపీస్ జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్,వాహబ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పవన్, బుస్స రాజశేఖర్,దేశెట్టి నరేష్,కేమ్మ సారం రాజేష్ ఖన్నా,పవన్,నాగరాజు,దస్తగిరి,వినోద్,ఉప్పెరెట్ల సంతోష,లహరి,మార్క పద్మ,స్రవంతి,చోట అజమాత,ఏరాబోలు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ డైరెక్టర్లు, సర్పంచులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పూజల హరికృష్ణ గారికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు...

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ,ఆగస్టు 29**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మరియు కింది స్థాయి సిబ్బందికి వరకు సమయపాలన పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. శనివారం మీరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్**

అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్, ల్యాబ్ టెక్నిషియన్స్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ వెరిఫై చేశారు. మెడికల్ ఆఫీసర్ లీవ్ లో ఉన్నట్లు తెలపగా లీవ్ లెటర్లు చెక్ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని మెడికల్ పరికరాలు ఎక్కువ మొత్తంలో పెట్టుకోవాలని, గ్రామీణ ప్రాంతాలు కావున సీజనల్ వ్యాధులకు ఇతరత్ర వ్యాధులకు సంబంధించి మెడిసిన్ అన్నియు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అత్యంత జాగ్రత్తగా, ఓపికగా మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి వైద్యం అందిస్తున్నారని భరోసా కల్పించాలని ఆదేశించారు. డికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బందికి వరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. పై అధికారి అనుమతి లేనిదే సెలవు తీసుకుంటే జీతంలో కోత తప్పదని హెచ్చరించారు. చర్మ వ్యాధి వలన ఆసుపత్రికి వచ్చిన వృద్ధుని తో మాట్లాడుతూ చర్మవ్యాధులు ఎక్కువ మొత్తంలో మనం తినే ఆహారం, నీటి ద్వారానే వస్తాయని, మంచి ఆహారం తీసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేసుకోవాలని సూచించారు. వృద్ధులకు, దీర్ఘ కాలిక వ్యాధి గ్రస్తులు, మోకాళ్ళ నొప్పులు బాధపడే వారికి ఆయుష్ యునానిలో మంచి వైద్యం ఉందని, ఈ వృద్ధునికి చర్మ వ్యాధికి వైద్యం చెయ్యాలని యునాని డాక్టర్ ను ఆదేశించారు.

## ముందస్తు వైద్య పరీక్షలతో వ్యాధులను గుర్తించి నయం చేసుకోవచ్చు

**- నివా బుపా ఆరోగ్య బీమా సంస్థ సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట: ఆగస్టు 29**




ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, సరైన చికిత్సతో నయం చేసుకోవచ్చని నివా బుపా సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ సోమవారం సిద్దిపేట పట్టణంలోని తమ కార్యాలయంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ పైన ఉన్న నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు.ఈ కార్యక్రమంలో నివా బుపా ఆ సిబ్బంది సామ్యూల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నారాయణరావుపేటలో వాలీబాల్ టోర్నమెంట్

**సిద్దిపేట టైమ్స్, నారాయణరావుపేట: ఆగస్టు 29**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణరావుపేట గ్రామ సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో నారాయణరావుపేట ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గ్రామ యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం విశిష్టత, క్రీడల ప్రాధాన్యతపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డాక్టర్ ప్రియాంక గారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ధ్యాన్‌చంద్ తన అద్భుతమైన క్రీడా ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావంతో భారతదేశానికి ప్రపంచస్థాయిలో గొప్ప గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.క్రీడలు కేవలం గెలుపు కోసం మాత్రమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టుస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామానికి కేటాయించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడల్లో ఓటమిని కూడా ఒక పాఠంగా తీసుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని, లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించే వరకు కృషి చేయాలని యువతకు సూచించారు.గ్రామ సర్పంచ్ బొంగురం ఎల్లారెడ్డి గారు మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. యువత మద్యపానానికి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి యువకుడు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు గారు మాట్లాడుతూ పదవ తరగతి అనంతరం చాలామంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని అన్నారు. యువత క్రీడల్లో ముందుండాలని, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభను కనబరిచి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం ఐదు జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో జూనియర్ నారాయణరావుపేట జట్టు ప్రథమ స్థానం, స్పోర్ట్స్ సన్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బింగి నవీన్ కుమార్, వార్డు సభ్యులు బాగన్న, బుగ్గరాజ్, బాగన్న నవీన్, వ్యాయామ ఉపాధ్యాయులు తోట సతీష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైంది.



https://siddipettimes.com
సిద్దిపేట టైమ్స్
తెలుగు దినపత్రిక
ఆదివారం, హైదరాబాద్
30-08-2026
http://siddipettimes.com






# పటేల్‌గూడలో ఘనంగా దుర్గామాత, భూలక్ష్మి అమ్మవార్ల వార్షికోత్సవం

* ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్
* అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: నరసింహ గౌడ్

**అమీన్‌పూర్, ఆగస్టు 29, సిద్దిపేట టైమ్స్ :**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ డివిజన్ పటేల్‌గూడలో కొలువైన శ్రీ దుర్గామాత, శ్రీ భూలక్ష్మి అమ్మవార్ల ఆలయాల ఐదవ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి అమీన్‌పూర్ పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. పటేల్‌గూడ దుర్గామాత, భూలక్ష్మి అమ్మవార్లు మహిమాన్వితమైన శక్తిస్వరూపిణులని, భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తున్నారని కొనియాడారు. ఆలయ నిర్మాణం జరిగి ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ ప్రజలకు, భక్తులకు, ఆలయ కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో అమీన్‌పూర్ పరిధిలోని ప్రజలే కాకుండా, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సకల ఐశ్వర్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు,



ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్నదాన, తీర్థప్రసాద ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# విద్యార్థులు, యువతకు అందుబాటులో విజ్ఞాన భాండాగారం

* తిగుల్‌లో గ్రంథాలయ ఏర్పాటుకు హామీ.. త్వరలోనే నిధుల కేటాయింపు
* జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

**సిద్దిపేట టైమ్స్,జగదేవపూర్, ఆగష్టు 29**

గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి, విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం తరపున ఎల్లవేళలా కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు సంబంధించి శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు.

తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కప్పర భాను ప్రకాశ్‌రావు అభ్యర్థన మేరకు గ్రామాన్ని సందర్శించిన చైర్మన్.. పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రంథాలయం ఏర్పాటుకు అనువైన స్థలం ఉన్నట్లు గుర్తించారు. గ్రంథాలయం ఏర్పాటుకు గ్రామపంచాయతీ తరపున అవసరమైన కొన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రంథాలయానికి





అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రి, నిర్వహణకు సంబంధించిన అలవెన్సులు ఏర్పాటు చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ గది పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు మరిన్ని నిధులు అవసరమని భాను ప్రకాశ్‌రావు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన దరిపల్లి చంద్రం.. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే తిగుల్ గ్రంథాలయానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో చైర్మన్ దరిపల్లి చంద్రంను గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. అనంతరం తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాశ్‌రావు నివాసంలో తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి తేనీరు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వంగరి నాగరాజు, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు బట్టు దయానందరెడ్డి,మరియు పరుశురాం,కర్ణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు జంగని ఐలయ్య, యువజన కాంగ్రెస్ నాయకుడు మనోజ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషతోనే విలువలు సాధ్యం





**సిద్దిపేట టైమ్స్ కరీంనగర్ (ఇరుకుల్ల ) /దౌల్తాబాద్ :**

మాతృబాషను సంరక్షించుకోవడం ద్వారానే సమాజం లో విలువల పరిరక్షణ సాధ్యం అవుతుందని ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాల /కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాలలో టి ఎల్ ఎమ్ మేళా, పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ బాషా సామాన్యునికి అందుబాటులో ఉన్నప్పుడే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జ్ఞానం కోసం ఇతర భాషలు నేర్చుకున్న కానీ మాతృ బాషా జ్ఞానం లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. సాహిత్యం ద్వారానే సమాజంలో విలువలు కాపాడబడతాయని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో మాతృ బాషా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గిగుడు రామ్మూర్తి, శ్రీ శ్రీ, కాళోజి, దాశరథి లాంటి కవుల రచనలు ఉత్తమ మానవుని జీవితానికి దిశా నిర్దేశం చేస్తాయని కావున సాహిత్య అధ్యయనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టి ఎల్ ఎమ్ మేళా విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో పాఠశాల కో ఆర్డినేటర్ సురేష్ , కళాశాల అధ్యాపకులు నాజియా,రాజు, శ్రీలత, అశోక్ ఉపాధ్యాయులు సతీష్,విష్ణు, శ్రీనివాస్, పవన్, షాజీయుద్దీన్, రాజు,అస్రా, జ్యోతి, శ్రీలత, ఉదయ, ఫైజా, షాహెదా, రాజు, వార్డెన్ ఫకృద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులతో మెరుగైన సేవలు

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

స్మార్ట్ రేషన్ కార్డులతో మెరుగైన సేవలు అందుతాయని పర్కిబండ సర్పంచ్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉప సర్పంచ్ నిమ్మల మహేష్ యాదవ్ తో కలిసి ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల తో ప్రజాపంపిణి వ్యవస్థ లో పారదర్శక సేవలు అందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిపిఓ కుమార్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, రేషన్ డీలర్ మధుసూదన్ గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్ రెడ్డి

**సిద్దిపేట టైమ్స్,కోహెడ:**

వరి పంటలో కాండం తొలిచే పురుగు (స్టెమ్ బోరర్) ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోహెడ వ్యవసాయ విస్తరణ అధికారి బేతి శ్రీధర్ రెడ్డి సూచించారు.శుక్రవారం కోహెడ మండలంలోని వరి పంట పొలాలను ఆయన సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు.ప్రస్తుతం వరి పంట పిలక దశలో ఉందని,ఈ దశలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.పురుగు ఆశించినప్పుడు వరి మొక్క మధ్య కాడలోకి ప్రవేశించి పంటకు నష్టం కలిగిస్తుందని వివరించారు.పిలక దశలో పురుగు ఆశించినట్లయితే మధ్య కాడ ఎండిపోయి 'డెడ్ హార్ట్'లక్షణం కనిపిస్తుందని చెప్పారు. మొక్కను లాగితే సులభంగా బయటకు రావడం, కాండంలో పురుగు లేదా దాని విసర్జన పదార్థాలు కనిపించడం వంటి లక్షణాలను రైతులు గుర్తించాలని సూచించారు.రైతులు తీసుకోవాల్సిన చర్యలు పొలాన్ని తరచుగా పరిశీలిస్తూ కాండం తొలిచే పురుగు లక్షణాలను ముందుగానే గుర్తించాలి. పురుగు ఉధృతిని పర్యవేక్షించేందుకు ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.పురుగు మందులను అవసరానికి మించి లేదా విచక్షణారహితంగా పిచికారీ చేయకుండా ,సూచించిన మోతాదులో మాత్రమే వినియోగించాలి.పొలంలో అధికంగా నత్రజని ఎరువులు ఉపయోగించకుండా సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలి.నాట్లు వేసిన 15 20 రోజుల మధ్య కార్బొఫ్యూరాన్ 3జి లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోలు, లేదా క్లోరంత్రానిలిప్రోల్ 4జి గుళికలు ఎకరానికి 4 కిలోల చొప్పున వినియోగించుకోవాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు/ఎకరం,క్లోరంత్రానిలిప్రోల్ 60 మి.లీ./ఎకరం లేదా ఐసొసైక్లోసీరమ్ 120 మి.లీ./ఎకరం చొప్పున పిచికారీ చేసుకోవడం ద్వారా పురుగు ఉధృతిని కొంతవరకు నియంత్రించవచ్చని శ్రీధర్ రెడ్డి తెలిపారు.రైతులు పంటను నిరంతరం పరిశీలిస్తూ పురుగు లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు వట్టిపల్లి రవీందర్ రెడ్డి,చల్ల జైపాల్ రెడ్డి,తాడిచెట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతిక్కరికి ప్రభుత్వ పథకాలు

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని పాలాట సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్ అన్నారు. శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం లో పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందచేశారు. పేదలు తమకు అందాల్సిన పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పంచాయతి కార్యదర్శి మహేందర్,పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



# మల్లన్న ఆలయానికి 15 లక్షల విరాళం



**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్మించే 100 గదుల సత్రానికి హైదరాబాద్ సౌభాగ్యనగర్ కొత్తపేటకు చెందిన మల్లికార్జున గౌడ్ తో పాటు కుటుంబ సభ్యులు శనివారం 15 లక్షల రూపాయల మొత్తాన్ని చెక్కు ద్వారా విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్ కు అందజేయగా ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని శేష వస్త్రాలను అందించి ఆశీర్వదించారు. అనంతరం ఏఈఓ మాట్లాడుతూ త్వరలోనే 100 గదుల సత్రం ప్రారంభమవుతుందని విరాళం ఇచ్చే దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు నీల చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.




# ప్రకృతి వ్యవసాయ పథకం పర్యవేక్షణకు సిబ్బంది నియామకం

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో భారత, తెలంగాణ ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం పర్యవేక్షణకు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రాజెక్టు ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అర్హులైన సిబ్బందిని సమకూర్చాలని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను వ్యవసాయశాఖ కోరింది. ఈ పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, జీతభత్యాలు, ఇతర నియమనిబంధనల వివరాలను వ్యవసాయశాఖ డైరెక్టర్ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవచ్చని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.